
కొత్తపల్లి

పిల్లల కథల పుస్తకం



49

కొత్తపల్లి పిల్లల కథల పుస్తకం-49 మే 2012

మూలం: http://kottapalli.in/2012/05/welcome

మొత్తం ప్రతుల సంఖ్య: 2000

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం 'కెరటం': వీరాంజనేయులు

అక్షర కూర్పు: *కొత్తపల్లి*


వెల:రూ.20/-

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు!

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 08559 240222, 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in



విషయ సూచిక

నీలపు నీటిచుక్క

అనగనగా ఎప్పుడో ఒక నీలపు నీటి బొట్టు ఉండేదిట. నీలం రంగుతో మెరిసిపోతూ చాలా అందంగా ఉండేదది. దగ్గరున్న వాళ్లంతా దాన్ని చాలా ముద్దు చేసేవాళ్లు- అన్ని నీటిబొట్లూ మామూలుగా ఉంటే ఇది మాత్రం నీలంగా మెరిసేది కదా, అందుకని. అట్లా అందరూ ముద్దు చేసీ చేసీ, నీలంరంగు నీటిబొట్టుకు ఒక కోరిక కలిగింది, "ఒలికి పోయినట్లు, జారిపోయినట్లు, ఎక్కడెక్కడికో ప్రయాణం చేస్తూంటే ఎంత బాగుంటుంది! ఏదో ఒక వంకలో కలిసి ప్రవహిస్తే ఎంత బాగుంటుంది కదా!" అనిపించింది.

అనుకున్నదే తడవు అది ఓ వంకలోకి దూకింది. వంకలో తోటి నీళ్లతో పాటు ఒలికి పోయింది, జారిపోయింది, కలిసి ప్రవహించింది.

రాను రానూ ఆ వంకకు ఇంకో వంక కలిసింది. మళ్లీ ఇంకోవాగు, అన్నీ ఓ పెద్దనదిలో కలిశాయి! నీలపు నీటిబొట్టూ అన్నింటితో బాటు కలసి ప్రవహించింది, ఎందరెందరో పిల్లల వ్రేళ్లలోంచి, కాళ్లమీంచీ జారుకుంటూ పోయింది. ఎందరెందరు వెంటపడ్డా దొరక్కుండా ఊరించుకుంటూ పోయింది.

అంతలో దూరంగా కనబడింది దానికి- ఒక మహాసముద్రం!


"రా, రా! చిన్నారీ! చిట్టి నీటి చుక్కా, రా! నాలో కలు!" పిలిచింది సముద్రం. "నేనెంత విశాలమో చూడు! నాలో నీలాంటి బొట్లు ఎన్ని ఉన్నాయో చూడు! నీదీ, నాదీ ఒకే ప్రాంతం కూడానూ! రా, నాలో కలిసిపో" అన్నది సముద్రం.

సముద్రంలో నీళ్ళు ఎగిరి క్రింద పడుతున్నై; మళ్లీ ఎగురుతున్నై! ఎగిరెగిరి దూకుతూన్న ఆ నీళ్లలో ఉయ్యాలలూగుతూ తనలాంటి నీటి చుక్కలు చాలా కనబడ్డై, నీలి నీటి చుక్కకు. "బాగుంది!

భలే ఉంది!" అనుకుంది. అన్ని నీళ్లతో బాటూ సముద్రంలో కలిసింది. ఎగిరింది, దూకింది, యీత కొట్టింది. తనలాగే ఉన్న నీటి బొట్లని కలిసింది. ఉరకలు వేసుకుంటూ అలల మీద ఉయ్యాలలూగి పాటలు పాడింది.

సముద్రం దాన్ని చూసి నవ్వింది ముసిముసిగా , "ఇదిగో , మా పాప! మా ఊరిదే ! ఎంత బాగుందో చూశారా?" అని చెప్పింది అందరికీ.

రాను రాను నీటి బొట్టుకెందుకనో అనుమానం వచ్చింది, "తనకు తోడుగా ఉన్న నీళ్లేవీ తనంత సంతోషంగా లేవు. ఏదో దిగులు వాటిని బాధిస్తోంది! ఏవో కోరికలు వాటివి, తీరట్లేదు! ఏంటవి?"



సముద్రం అన్నది - "వాటిని పట్టించుకోకు ! బాధల బరువుతో అవి ఎగరటాన్నే మర్చిపోయినై, ముసలివైపోయినై. నువ్వు రా! అలల కెరటాల మీద స్వారీ చెయ్యి! సంతోషంగా నవ్వుల బుడగలు ఊదు, రా!" అని.

నీలం రంగు నీళ్లచుక్క చాలా సార్లు అడిగితే ఒక నీటిబొట్టు చెప్పింది తన మనసులో మాట- "నాకు ఈ సముద్రం దాటి పోవాలని ఉంది. కానీ ఎలాగ? దీన్ని దాటేదెలాగ?" అని. "దాని దేముంది, సముద్రాన్ని అడిగితే సరి! అదే దాటిస్తుంది" అని , నీలి నీటి చుక్క సముద్రాన్ని అడిగింది.

సముద్రం నవ్వింది- ఫెళఫెళా! ఉరుము ఉరిమినట్లు, సింహం గర్జించినట్లు- "అది వీలుకాదు, ఇన్నాళ్లూ నేను మీకు ఆశ్రయం ఇచ్చిందే ఎక్కువ! మీ మనుగడ అంతా ఇక నాతోటే! నేను

లేకుండా మీరు లేరు! మీరు ఏనాటికీ నన్ను వదిలి పోలేరు!" అన్నది.

"అంటే... నేను కూడానా?!" అడిగింది నీలి నీటి చుక్క అమాయకంగా.

"నువ్వేమన్నా ప్రత్యేకంగా పుట్టావా? అందరిలాగే కదూ, నువ్వూనూ? ప్రపంచ నియమాలు తెలీనట్లు మాట్లాడతావేమి? నీకిక చేతనైందల్లా నాలో కలిసిపోయి బ్రతుకునీడ్వటమే. ఊరుకో, అల్లరి చేయకు; అల్లరిపడకు !" అన్నది సముద్రం మొరటుగా . "నువ్వెంత, ఒక నీటిబొట్టువి. నేను మహాసముద్రాన్ని . నాలో కలిసినందుకు నువ్వు అసలు గర్వించాలి. నీ అస్తిత్వం వృద్ధి చెందిందని సంతోషించాలి. నీ స్థాయి నెరిగి మసలుకోవాలి" అని నవ్వింది.

నీలి నీటిబొట్టు ఏడ్చింది. తన అసలుతనాన్ని తెలియజెప్పిన సముద్రం అంటే దానికి విపరీతమైన కోపం వచ్చింది. "కానీ ఏం చెయ్యగలను?" అని విచారపడింది. నిరాశ చెందింది. ఆ నిరాశలో దాని మెరుపు తగ్గటం, వన్నెవాయటం గమనించి మరింత దిగులైంది.

అప్పుడు గమనించిందది - "సముద్రం పైకి కనబడుతున్నంత ప్రశాంత గంభీరంగా లేదు. అందులో నీళ్ల బొట్లు చాలా ఉడికిపోతున్నై , కళవెళ పడుతున్నై, నిరంతరంగా తుఫానులు రేపుతూనే ఉన్నై. జ్వాలాముఖులు అనేకం యీ సముద్ర గర్భంలోంచే బ్రద్దలౌతున్నై- తన ప్రపంచంలో తను ఉండి గమనించలేదు- సముద్రంలో తలెత్తే అలలు అసలు ఉయ్యాలలే కావు! ఊయలలూగుతున్నట్లు కనబడే నీటిబొట్లలో అనేకం ఈ సముద్రపు సంకెళ్ల వలల్ని ఛేదించుకొని పైకి ఎరిగిపోయేందుకు ప్రయత్నిస్తున్న పోరాట కణాలు!!"

"సముద్రం చెప్పినట్లు, తను నిజంగానే ప్రత్యేకమైనదేమీ కాదు; కానీ తను ఒంటరిది కూడా కాదు. ఎగసిపడే కెరటాల్లో ఉన్న నీటి కణాలు ఒంటరివెలాగ అవుతాయి?"

నీలి నీటిబొట్టు ఏడుపు ఆగిపోయింది. సముద్రపు అహంకారాన్ని చూసి ఇప్పుడా నీటిబొట్టు నవ్వింది. ఎగసిపడే కెరటాలకు మరొక్క కణం తోడైంది. చూస్తూండగానే కణానికి కణం

చేరుకున్నై, అన్నీ కలిసి పైకెగిరినై!!

"ఈ ఉప్పెన ఎలా వచ్చింది?" అని సముద్రం కంగారు పడేసరికి ఏం జరగాలో అదంతా జరిగిపోయింది- విశాలాంభోరాశిలోని ఒక్కొక్క నీటిబొట్టూ మహోర్గళంలో కలిసి నింగికెగసింది! నింగికెగసిన నీటిబొట్లు ఇక క్రిందకి జారలేదు- మేఘచయాలై భూతలాన్నంతా పరచుకున్నాయి. ఒకనాటి అపారపారావధి ఇప్పుడు మృతసముద్రమైంది. వినీలాకాశం క్రింద చిన్న మడుగై నిల్చింది!

చిన్ని నీటిబొట్లూ, ఎగసిపడే కెరటాలూ, ఆకర్షించే సముద్రాలూ, మడుగులైపోయి నిలబడే మృత సముద్రాలూ- ఇవన్నీ మానవ సమాజపు గతిలో భాగాలే. పిల్లలు కదా, మీకు ఇవేవీ కనబడలేదేమో, ఇంకా- లేకపోతే అక్కడక్కడా ఏమన్నా కనిపించాయా, ఎప్పుడైనా?


అందరికీ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు.

కొత్తపల్లిబృందం.

శ్రీ సాయినాథ్ స్కూలు, పొదలకూరు,
నెల్లూరులో ఏడో తరగతి చదివే శరత్
చంద్రిక పంపిన అంత్యానుప్రాస కవితలు
ఇవి- మీరూ రాయచ్చుగా, ఇలా?!

టి.వి.లో వస్తుంది హైడీ
చుట్టుకొలత సూత్రము - పైడీ
వారు అలసిపోయారు క్రికెట్ ఆడీ
అందుకే తాగుతున్నారు గ్లూకోస్-డీ

నాపేరు బాటా
నేను తినడానికి సరిపోదు ఒక తోట
నేను తాగడానికి చాలదు ఒక లోట
నేను కూర్చుంటే విరిగిపోద్ది పీట
నన్ను తూయడానికి సరిపోదు కాట
నేను పాడాను ఒక పాట
వీరు నన్ను కట్టేశారు మూట
నేను ఊరికి వెళుతుంటె ఎవరూ-
చెప్పలేదు నాకు టాటా!



నీతిచంద్రిక


విగ్రహం-7

జరిగిన కథ: నెమలి రాజు చిలుకను కొంగతో కలిసి వెళ్ళమంటాడు. చిలుకకు అది ఇష్టంఉండదు. 'దుష్ట కొంగ తనను దారిమధ్యలోనే చంపేయచ్చు' అని సందేహం వ్యక్తం చేస్తూ, అది 'హంస-కాకి' కథ చెప్పటం మొదలుపెడుతుంది. ఇక చదవండి- నీతిచంద్రిక 31 వ భాగం

మూలం: కీ.శే. కందుకూరి వీరేశలింగం *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

ఉజ్జయినీ నగరానికి వెళ్ళే దారిలో ఒక గొప్ప రావిచెట్టు ఉండేది. ఆ చెట్టు మీద ఒక కాకి, ఒక హంస రెండూ గూళ్ళు కట్టుకొని నివసించేవి. అవి అట్లా ఉంటూ ఉంటే, ఒక సారి ఎండాకాలం వచ్చింది. ఎండలు మండిపోతున్నాయి. ఆ సమయంలో దారివెంబడి పోతున్న బాటసారి ఒకడు చాలా అలసిపోయి, రావి చెట్టు నీడన కాళ్ళు చాపుకొని పడుకున్నాడు. రక్షణకని వెంట తెచ్చుకున్న ధనుస్సును ఒకదాన్ని అలాగే ఎక్కుపెట్టి, ప్రక్కన పెట్టుకొని ఉన్నాడు వాడు. అయితే కొంతసేపు గడిచేటప్పటికి, సూర్యుడు

ముందుకు జరిగాడు; దాంతో నీడ కూడా ప్రక్కకు తొలగింది. బాటసారి ముఖంమీద ఎండ పడటం మొదలుపెట్టింది. చెట్టుమీద ఉన్న హంస ఆ బాటసారి అవస్థను చూసి జాలిపడింది. తన రెక్కలు చాపి, ఎండకు అడ్డంపెట్టి కదలకుండా కూర్చున్నది.



అలా హంస రెక్కల నీడన బాటసారి హాయిగా నిద్రపోతుంటే చూసింది కాకి. సహజంగానే దుష్టస్వభావి అయిన ఆ కాకికి వాడి సుఖాన్ని చూసి కళ్ళుకుట్టాయి. వాడిని అలా చూస్తూ ఊరుకోలేకపోయింది అది. గబుక్కున ఎగిరి వచ్చి అతని పైనున్న కొమ్మ మీద వాలింది. సరిగ్గా అతని ముఖం మీద పడేటట్లు రెట్ట వేసింది. తటాలున ఆ చోటును వదిలి ఆకాశానికి ఎగిరి మాయమైపోయింది.

దుష్టబుద్ధి అయిన ఆ కాకి, తన బుద్ధిని అందరికీ చాటి చెప్పటం కోసం అట్లా చేసి ఉండవచ్చుగానీ, అంతకు మించి ఏమైనా లాభం ఉందా, దానికి? దుష్టులకు ఇతరులను హింసించటాన్నిమించిన పరమావధి మరొకటి కనబడదు.

సరే, ఇంకేముంది? బాటసారికి నిద్రాభంగమైంది. వాడు కళ్ళు తెరిచి అటూ ఇటూ చూశాడు. చెట్టుమీద రెక్కలు చాపుకొని కూర్చున్న హంస కనబడింది వాడికి. తన ముఖం మీద రెట్టవేసింది అదే అనుకున్నాడు వాడు. దాంతో వాడికి దానిమీద చాలా కోపం వచ్చింది. అప్పటికే ఎక్కుపెట్టి ఉన్న విల్లును తీసుకొని వాడు ఒక్క బాణంతో హంసను నేలకూల్చాడు. ఏ పాపం ఎరుగని ఆ అమాయకపు హంస తోటి హంసల ఆశలన్నిటినీ బూడిద చేస్తున్నట్లు నేలరాలి ప్రాణం విడిచింది.

చూశారా, కాలం వక్రీకరిస్తే ఇలాగే అవుతుంది. దైవ నిర్ణయానికి తిరుగు ఉండదు కదా! అపరాధి అయిన కాకి హాయిగా ఎగురుతుంటే, ఏలాంటి తప్పూ చేయని హంస హింసింపబడింది చూడండి! 'పాపీ చిరాయు:' అని పెద్దలు చెప్పే మాటలో ఏమాత్రం అసత్యం లేదు. చెడ్డవాళ్లతో సహవాసం ఏనాటికైనా కష్టాలనే తెచ్చిపెడుతుంది.



చిలుక ఆ కథ చెప్పి ఆగగానే నేను దానివైపుకు తిరిగి - "మిత్రమా! నాకు మా ప్రభువైన హిరణ్యగర్భుడు ఎంతటివాడో నువ్వూ అంతే. మహాత్ములైనవారికి ఈ లోకంలో అందరూ ఆత్మ సమానులే- తనతో సమానమైనవారే! వారికి 'పరాయివాళ్ళు' అంటూఎవరూ ఉండరు. స్వ-పర భేదాలెంచేది మందబుద్ధులేగాని, మహానుభావులకు అట్లాంటి తేడాలేవీ ఉండవు. 'ఆత్మవత్ సర్వభూతాని'-'ఎల్లప్రాణులూతనలాంటివారే' అని వినలేదా? నా మనస్సు ఎంత లోతైనదో తెలియక, ఊరికే నిందలు మోపుతున్నావేల? ఒక్క నిముషంలో నశిస్తుందికదా, ఈ శరీరం?! అట్లాంటి ఈ శరీరాన్ని నమ్మి, నీ ఉసురు పోసుకొని, శాశ్వతమైన నరకకూపంలో పడి ఎవ్వరైనా పడరాని బాధలు ఎందుకు బాధలు పడతారు?

నా పట్ల నీకు విశ్వాసం ఎందుకు, ఉదయించదు? మహాత్ములతో కలిసి ఏడు అడుగులు నడిచినంత మాత్రాన వాళ్లతో చెలిమి ఏర్పడిపోతుందని వినలేదా? పండ్లను (అట్లాగే, పనులను) చెడగొట్టటం నీ సహజగుణం కదా, అందుకనే నీకు అందరూ

అట్లా కనబడతారు కాబోలు. నీ అల్పబుద్ధిని ప్రక్కన పెట్టి, ప్రయాణమై రా, పోదాం" అన్నాను.

అప్పుడా చిలుక పక పకా నవ్వి, "ఓరీ, నువ్వు కప్ప చర్మం కప్పుకున్న పాములాంటిదానివి. నిన్ను చూస్తే ఎవరికన్నా నమ్మకం చిక్కుతుందా? ఏది ఏమైనా, ఆత్మ రక్షణ దగ్గరికి వచ్చేసరికి 'ఏమరపాటు' అనేది ఎవ్వరికీ పనికిరాదు. ఇప్పటి పగను నువ్వు మనసులో పెట్టుకొని, బయట పడకుండా, కొంచెం దారి సాగనిచ్చి, ఎవ్వరూ లేని నిర్జన ప్రదేశంలో ఎక్కడో నన్ను మోసగించి చంపుదామని ఇన్ని ఎత్తుగడలు వేస్తున్నావు. ఇంతసేపూ నన్ను, మా రాజును నోటి దురద తీరేట్లు తిట్టి, ఇంతలోనే ఏ నోరు పెట్టుకొని మళ్ళీ స్నేహం కోసం అర్రులు చాస్తున్నావు? 'పరమ దుర్మార్గులలోకెల్లా అతి దుర్మార్గుడివి నువ్వు'- అని నీ వాలకం చూడగానే తెలిసిపోతున్నది. 'అతివినయం ధూర్త లక్షణం'- అతి మర్యాద చూపటం దుర్మార్గుల లక్షణం అని పెద్దలు చెబుతారు. దుర్మార్గుల మాటలు ఇష్టంగాను, 'అవునవును' అనిపించేవిగాను ఉన్నప్పటికీ, కాలంగాని కాలంలో వచ్చే పువ్వుల మాదిరి అవి చివరికి లేనిపోని కష్టాలనే తెచ్చిపెడతాయి. నువ్వెంత దుర్మార్గుడివో నీ మాటతీరుతోటే తెలియవస్తున్నది. చిత్రవర్ణ-హిరణ్యగర్భుల మధ్య జరగనున్న మహోగ్ర యుద్ధానికి నీ మాటలేకద, కారణం? శత్రువైనవాడు చంపటం కోసం ఎన్ని ఎత్తులైనా వేస్తాడు. భూమిమీద ఇంకొంతకాలం జీవిద్దాం అనుకుంటున్నవారెవ్వరూ అలాంటి మాటలకు తావు విడువరు. గతంలో ఒక మువ్వన్నె మెకం (మూడు రంగుల జంతువు- పెద్దపులి) అట్లానే కద, ఒక కొంగను అంతం చేసింది?! నీకు ఆకథ చెబుతాను- జాగ్రత్తగా విను:

మిత్రద్రోహం అనే పులి-కొంగల కథ

జంబూ ద్వీపంలో గ్రామ్యకం అనే చాలా అందమైన అడవి ఒకటి ఉండేది. ఎల్లప్పుడూ వికసించి ఉండే అడవి మల్లె పూల తీగెల చేత కప్పబడ్డ పొదలు లెక్కకు మిక్కిలిగా ఉన్న

పొదరుటడవి ఒకటి అందులో ఉన్నది. పూల సమూహాలు వెదజల్లే సువాసనలతో కలిసి జారిన మకరందపు బిందువులను ఆస్వాదించటంకోసం వచ్చిన తుమ్మెదల గుంపులతో ఆ పొదరుటడవి మరింత శోభిల్లేది. చెట్ల కొమ్మల గుబుర్లలో కూర్చొని ఎడతెరపిలేకుండా కూస్తున్న పక్షుల కిలకిలారావాలతో ఆ పొదరుటడవి నలు దిక్కులూ పిక్కటిల్లిపోతుండేవి. ఆ అడవి మధ్యలో ఒక చెట్టు క్రింద ఒక పొద ఉండేది. మిట్ట మధ్యాహ్నంకూడా సూర్యకిరణాలు చొరనంత దట్టంగా ఉండేది, ఆ గుబురుపొద. అట్లాంటి ఆ పొదలో నివసించేది, ఒకపెద్ద పులి. దానికి దగ్గరలోనే ఒక జువ్వి చెట్టు ఉండేది. ఆ చెట్టుమీద గూడు కట్టుకొని ఒక కొంగ కాపురం ఉండేది.

ఒక రోజున ఆ పెద్దపులి ఒక పొట్టేలును చంపి, దాని మాంసం తింటూ ఉండగా, విధి వశాత్తు పొట్టేలు ఎముక, చిన్నది ఒకటి- దాని పళ్ళమధ్య సందులో ఇరుక్కుపోయి చాలా చికాకు పెట్టింది. పులి ఎంత ప్రయత్నించినా దాన్ని వెలికి తీసే మార్గం చిక్కలేదు. చివరికి అది ఎంత బాధకు గురైందంటే, తలనుక్రిందికి వ్రేలాడ వేసుకొని, నేలమీద పడి పొర్లి, తీవ్ర వేదన అనే భరింపరాని యాతనను అనుభవిస్తూ, దిక్కులు పిక్కటిల్లేటట్లు అరుస్తూ ఉండింది.



ఆ ఆర్తనాదాలకు పైనున్న కొంగ హృదయం ద్రవించింది. అది రావి చెట్టు పైననే కూర్చొని, క్రింద అవస్థపడుతున్న పెద్దపులిని చూసి "ఓ పులీ! నిన్ను ఈ అడవిలో చాలా కాలంగా చూస్తూ ఉన్నాను. ఇంతకుముందు ఎన్నడూ నువ్వు నోరు తెరచి ఇంతగా

బాధపడటం చూడలేదు. ఇప్పటి నీ పరిస్థితిని చూస్తే నాకు చాలా ఆశ్చర్యం కల్గుతున్నది. ఇంత కష్టం ఏమొచ్చింది, నీకు? చెప్పు" అన్నది.

ఆ ఓదార్పుమాటలకు పులి కొంత సంతోషించింది. దాని బరువు కొంచెం తగ్గినట్లయింది. నాలుక తడబడుతుండగా అది కొంగతో "ఓ దయామయా! నా దురదృష్టం ఏమని చెప్పేది? నిన్న రాత్రి నేను ఒక పొట్టేలును చంపి, ఆ మాంసం తింటూ ఉండగా, ఏ పాపకర్మ ఫలితమో మరి, ఒక ఎముక నా పళ్ళ సందులో ఇరుక్కుపోయింది. దాన్ని తీసే ఉపాయం తోచక, అప్పటినుండీ ఈ విధంగా అంతులేని క్షోభను అనుభవిస్తూ ఉన్నాను. 'ఇక నన్ను ఈ ఆపదనుండి గట్టెక్కించగల నాధుడు ఎవ్వరు?' అని ఆందోళన పడుతుండగా నా పాలిటి భాగ్యదేవతే 'నీ సాంగత్యం' అనే ఆధారాన్ని కల్పించింది. నిజంగా చూస్తే నువ్వు మామూలు కొంగవా- కానే కాదు! ఎన్నో జన్మలలో నేను చేసుకున్న పుణ్యకర్మల ఫలితమే, నన్ను బ్రతికించటం కోసం- నీ రూపం ధరించి నా ముందుకు వచ్చి నిలచింది! నాకిక నువ్వు తప్ప వేరే శరణ్యం లేదు. నాకు సాయం చేసినా, చేయకున్నా నువ్వే గతి. నా కోరికను వ్యర్థం చెయ్యక, మంచి మనసుతో కాస్తంత ప్రాణదానం చేసి పుణ్యం కట్టుకో. నాకింత మాత్రం మేలు చేశావంటే జీవితాంతం నీ మేలు మరచిపోను. ఇక ఆలస్యం చేయకు. ఆపదలో ఉన్న నన్ను రక్షించు" అని దీనంగా, పలు రకాలుగా ప్రార్థించింది.

అప్పుడా కొంగకు పట్టరాని దయ పుట్టి, చెట్టు దిగి వచ్చింది. కోరల పులి నోరు తెరచుకొని ఉండగా అది తన ముక్కును చటుక్కున దాని నోటిలోనికి జొనిపి, ఉపాయంగా ఆ ఎముకను బయటికి లాగేసింది. అది మొదలుకొని ద్వీపంలో నివసించే ఆ పులి, గాలిలో విహరించే ఆ కొంగ- రెండూ మంచి మిత్రులైనారు- ఇద్దరూ స్నేహంలోని సుఖాన్ని చవిచూడటం మొదలుపెట్టారు.

(ఆ తర్వాత ఏమైందో మళ్ళీ చూద్దాం...)



గొప్పలు చెప్పకు!



రచన: సౌమ్య, అనిత, గౌతమి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గడ్డంనాగేపల్లి, అనంతపురం జిల్లా.

రేకులకుంట బళ్ళో చదువుకునే సునీల్‌కి గర్వం ఎక్కువ; డబ్బు పిచ్చి కూడాను. "తనే గొప్పవాడు" అని అందరితోటీ చెప్పుకునేవాడు ఎప్పుడూ. రేకులకుంటలో ప్రతి సంవత్సరం గంగమ్మ జాతర చేసేవాళ్ళు. చాలా ఆనందంగా జరుపుకునేవారు జాతరను. ఒకసారి గంగమ్మ జాతర సందర్భంగా పిల్లలందరికీ ఆటలపోటీలు పెట్టారు. అందులో మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో గెలిచాడు సునీల్! దాంతో జాతర నిర్వాహకులు వాడికి ఒక నగదు బహుమతి ఇచ్చారు. ఇంకేముంది, వాడి గర్వానికి అంతులేకుండా పోయింది.

చివరికి వాడి స్నేహితులందరూ కలిసి "ఎలాగైనా వాడి గర్వాన్ని తగ్గించాలి" అనుకున్నారు. అందుకు తగిన ఉపాయం

ఆలోచించి పెట్టుకున్నారు. మరొక నెల రోజులకు, బడిలో ఆటలపోటీలు మొదలయ్యాయి. ఈసారి కూడా పరుగు పందెంలో పాల్గొన్నాడు సునీల్. పరుగు మొదలైంది- సునీల్ బాగా పరుగు పెడుతున్నాడు- అకస్మాత్తుగా అతనికి నేలమీద ఒక పది రూపాయల నోటు కనబడింది. దాన్ని పట్టించుకోకుండా ముందుకు పరుగు తీశాడు. అంతలోనే అతనికి ఎదురుగా మరొక పదిరూపాయల నోటు పడి కనిపించింది. వాడికి డబ్బు పిచ్చి కదా, అందుకని ఆగి, అటూ ఇటూ చూసి, వంగి దాన్ని ఎత్తి జేబులో వేసుకున్నాడు. మరికొంత దూరం వెళ్ళేసరికి ఇంకొక నోటు! ఇలా ఐదారు నోట్లు ఏరుకుంటూ సమయాన్ని పట్టించుకోలేదు వాడు. దాంతో మిగిలినవాళ్లంతా వాడికంటే ముందు గమ్యం చేరుకున్నారు!

"ఏంరా, సునీల్! పది రూపాయల నోట్లు!!" అని నవ్వారు మిత్రులంతా. సిగ్గుపడ్డ సునీల్ తన తప్పును తెలుసుకున్నాడు. తనను క్షమించమనికోరాడు మిత్రుల్ని. గర్వాన్ని, డబ్బు పిచ్చిని జయిస్తానని మాట ఇచ్చాడు అందరికీ.

అటుపైన ప్రతి ఆటల పోటీలోనూ బహుమతులు వాడివే. కానీ ఏనాడూ వాడు గర్వం పాలవ్వలేదు. వాడిలోని మార్పుకు మిత్రులంతా చాలా సంతోషపడ్డారు.

సరైన చిరునామా!

వెంగళప్ప: నాకేమైనా ఉత్తరాలొచ్చాయా?

పోస్టమాన్: మీపేరు?

వెంగళప్ప: అది ఉత్తరాల మీదఉంటుంది, చూడవయ్యా!

నవ్వు!

చిల్లి!

టీచర్: రామూ! నేను నీకు రెండు రూపాయలు ఇచ్చాను, అయితే అవి రంధ్రం ద్వారా కిందపడ్డాయి. ఇంక నీ జోబులో ఏమి ఉంటుంది?

రాము: రంధ్రం ఉంటుంది టీచర్.



కలసి పని చేద్దాం

కథనం: యువరాజ్, 6 వతరగతి, రిషివ్యాలీస్కూల్, మదనపల్లి, చిత్తూరు జిల్లా.

అనగనగా ఒక ఊరిలో ఒక అమ్మాయి, వాళ్ళ మారుతల్లి ఉండేవాళ్ళు. ఆ అమ్మాయి పేరు రమ. రమ చాలా అమాయకురాలు. వాళ్ల మారుతల్లేమో అసలు మంచిదికాదు. ఆమెకు రమ అంటే చాలా కోపం కూడాను. రోజూ కచ్చేడన్ని బట్టలు తెచ్చి పడేసి రమను కుట్టమనేది. రమ అలసిపోతే కూడా "ఇంకా జోరుగా చేయి" అని ఒత్తిడి పెట్టేది. రమ ఇంకా చిన్నదే కదా, మరీ జోరుగా బట్టలు కుట్టటం రాదు.

అయితే ఒకరోజున మారుతల్లి రాణి దగ్గరికి వెళ్లింది. "నా కూతురు చాలా బాగా బట్టలు కుడుతుందమ్మా! ప్రతి రోజూ పది పది బట్టలు కుడుతుంది, ఇంకా కావాలని మారాం చేస్తుంది" అని అబద్ధాలు చెప్పింది. "ఓహో అట్లానా" అని రాణి స్వయంగా వాళ్ల ఇంటికి

వచ్చి చూసింది. రమని వాళ్ల రాజ్యానికి తీసుకొని పోయింది. ఆమెకు కచ్చెడన్ని బట్టలు ఇచ్చి, "ఒకే రోజులో పదిబట్టలు కుట్టాలి" అని ఆజ్ఞాపించింది. "మరుసటి రోజునుండే పని మొదలుపెట్టాలంది. ఇంక పాపం, రమ ఏమి చేస్తుంది? ఏమీ చేయలేక, ఒక గదిలోకి వెళ్లి తలుపు వేసుకొని బాగా ఏడ్చింది.

మరుక్షణం ముగ్గురు దేవతలు ప్రత్యక్షమయినారు ఆమెముందు-

మొదటి దేవత చెయ్యి చాలా పెద్దగా ఉంది. మరొక దేవత కాళ్ళు చాలా పెద్దగా ఉన్నాయి. చివరదేవత పెదవులు చాలా పెద్దగా ఉన్నాయి.

ఆ ముగ్గురు దేవతలకు బట్టలు కుట్టడమంటే చాలా ఇష్టం. మొదటి దేవత గబగబా దారాలు వడికింది. రెండో దేవత గబగబా బట్టలు పరచింది. మూడో దేవత గబగబా బట్టలు కుట్టింది. పది బట్టలూ కేవలం పది నిమిషాల్లోనే కుట్టేశారు ముగ్గురూ. అటు తర్వాత వాళ్ళు ముగ్గురూ మాయమయ్యారు. తెల్లవారాక రాణి వచ్చి చూసింది. "అబ్బ అన్ని బట్టల్ని ఒక్క రోజులో కుట్టేశావే" అని ముచ్చట పడింది. బట్టల్ని చూసి చాలా సంతోషపడింది.

అయితే ఏమైందంటే, ఆ బట్టల్ని చూడగానే ఆ రాజ్యపు రాకుమారుడు రమని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. రాకుమారుడు మంచివాడే; కానీ ఎవరిమాటా వినడు; ఎవరి సలహాలూ తీసుకోడు.

అతను పెళ్ళి చేసుకుంటానని చెప్పిన రోజు రాత్రి దేవతలు తిరిగి వచ్చారు రమ దగ్గరికి. ఆ రోజున రమ చాలా సంతోషంగా ఉంది. "మీ కోసం ఏమైనా చేస్తాను" అని మాట ఇచ్చింది వాళ్లకు. అప్పుడు దేవతలు అన్నారు- "మేము ముగ్గురం నీ పెళ్లికి వస్తాం" అని . "సరే, దానిదేముంది, రండి" అన్నది రమ. "'అయితే మీరు ఎవరు' అని ఎవరైనా అడిగితే నేను ఏమి చెప్పను?" అని అడిగింది . "'మేము నీ బంధువులం' అని చెప్పు!" అని సలహాఇచ్చారు దేవతలు.

మరుసటి రోజు పెళ్లికి అందరూ

హాజరయ్యారు; అందరితోబాటు ఆ దేవతలు కూడా ఆ పెళ్లికి హాజరయ్యారు. అందరూ వాళ్లను గురించి అబ్బురంగా చెప్పుకున్నారు. "వాళ్ళెవరు?" అని రమని అడిగారు అందరూ. "మా బంధువులు " అని చెప్పింది రమ. రాకుమారుడు వాళ్లకేసి ముద్దుగా చూస్తూ "ఎందుకు, ఒకరికి చేతులు పెద్దగా ఉన్నాయి, ఒకరికి కాళ్ళు పెద్దగా ఉన్నాయి, ఒకరికి పెదవులు పెద్దగా ఉన్నాయి?" అని అడిగాడు. "నేను గబగబా బట్టల్ని పరుస్తాను" అన్నది చేతులు పెద్దగా ఉన్న దేవత. "నేను చాలా బాగా పరుగెత్తి దారాలు వడుకుతాను" అని చెప్పింది రెండవ దేవత. "నేను దారాన్ని నా పెదవులతో సరి చేస్తూ వేగంగా బట్టలు కుడతాను" అన్నది మూడవ దేవత.

"ఓహో, అందుకేనన్నమాట, ఇంత త్వరగా, ఇంత చక్కని బట్టలు కుట్టగలిగింది రమ!" అనుకున్నాడు రాకుమారుడు. "అందరూ కలసి మెలసి ఉంటూ, ఒకరికొకరు సాయం చేసుకుంటే పనులు ఇంత బాగా నెరవేరుతాయా!" అని ఆశ్చర్యపోయాడు.


రాకుమారుడు, రమ అటుపైన ఒకరికొకరు సాయం చేసుకుంటూ కలసిమెలసి కలకాలం జీవించారు.

దానికి తెలీదు!

విద్యార్థి: నేను కంప్యూటర్ లో నా పాస్వర్డ్ కొట్టినప్పుడు.అక్షరాలన్నీ నక్షత్రాల్లా కనిపిస్తున్నాయి ఎందుకంటారు, టీచర్?

టీచర్: నీ వెనక ఎవరైనా వుంటే వారికి అర్థం కాకుండా వుంటడానికి అన్నమాట!

విద్యార్థి: మరి నా వెనక ఎవరూ లేనప్పుడు కూడా అలాగే వస్తోంది, టీచర్!?



తెలివి తేటలు

సేకరణ: బి.కాశ్యప్, తొమ్మిదవ తరగతి, అభ్యాసవిద్యాలయం, విజయవాడ.

సోమయ్య ,రాజయ్య, బసవయ్య ముగ్గురూ చాలా తెలివైనవాళ్లని ప్రతీతి. ఆ ఊరిలోనే వీళ్లంత తెలివైనవాళ్ళు లేరు.

వాళ్ళు ముగ్గురికీ ఒకసారి అనిపించింది-"ఇంత తెలివి తేటలు ఉన్నవాళ్లం; ఒకసారి రాజుగారి మెప్పు పొందితే బాగుంటుంది కదా" అని, ముగ్గురూ బయలుదేరి రాజుగారి దగ్గరికి వెళ్ళారు.

"మహారాజా! మేం ముగ్గురం మా తెలివితేటల ఆధారంగా అనేక సమస్యల్ని పరిష్కరించాం. ఇన్నేళ్లకు మీ మెప్పు పొందాలని వచ్చాం. మా తెలివిని పరీక్షించి తగిన బహుమతులు ఇవ్వవలసిందిగా కోరుతున్నాం" అన్నారు.

"ఓ, తప్పకుండా! అలాగే చేద్దాం" అన్నాడు రాజు, భటులను పిలిచి వారికి ఏదో చెబుతూ.

రాజ భటులు ఒక పెద్ద పెట్టెను తెచ్చి అక్కడ దింపారు-

"సరే, తెలివిగల పిల్లలూ, ఇప్పుడు చెప్పండి,

ఈ పెట్టెలో ఏముంది?" అని వాళ్ళు ముగ్గురినీ అడిగాడు రాజు.

ముగ్గురూ ఒక్కసారిగా అన్నారు: "అందులో మామిడిపళ్ళు ఉన్నాయి!" అని.

రాజయ్య అన్నాడు- "అందులో నిండా పళ్ళు లేవు ప్రభూ! కొన్ని పళ్ళు మాత్రమే ఉన్నై" అని.

బసవయ్య అన్నాడు- "అవునవును- అందులో మహా ఉంటే ఒక డజను పళ్ళు ఉన్నై" అని.

రాజుగారి ఆజ్ఞ మేరకు పెట్టెని తెరిచారు భటులు- చూస్తే అందులో నిజంగానే డజను మామిడిపళ్ళు ఉన్నాయి!

సభికులందరూ ఆశ్చర్యపోయారు.

" 'ఇందులో మామిడి పళ్లే ఉన్నాయి' అని మీకు ఎలా తెలిసింది?" అడిగాడు రాజు.

సోమయ్య అన్నాడు- "ప్రభూ! మామిడిపళ్ళు అంత చక్కని వాసన వేస్తుంటే మరొక ఆలోచన ఎలా వస్తుంది? నేను వాసనను బట్టి ఇవి మామిడి పళ్ళేనని కనుకొన్నాను" అని.

"వాసన ఎలాగూ ఉన్నది- భటులు పెట్టెను తెస్తున్నప్పుడు వాళ్ళు అసలు కష్టపడలేదు- అలవోకగా మోసుకొచ్చారు. దాన్ని బట్టి పెట్టె నిండుగా లేదని అర్థమైంది నాకు" అన్నాడు రాజయ్య.

"ప్రభూ! వాళ్లు పెట్టెను క్రిందికి దింపేటప్పుడు వచ్చిన శబ్దాన్ని బట్టి నేను అందులో సుమారు ఒక డజను పళ్ళు ఉంటాయని ఊహించాను" నవ్వాడు బసవయ్య.

రాజుగారికి వాళ్ళ తెలివితేటలు చాలా నచ్చాయి. ముగ్గురినీ సత్కరించటమే కాక, వారిని తన ఆంతరంగిక సలహాదార్లుగా నియమించుకున్నారు.

లక్ష మాటలకంటే ఒక్క పని మేలు



కాలం విలువ

రచన: యస్.రాజేశ్వరి, 8 వతరగతి, జిల్లాపరిషత్ హైస్కూల్, పెద్దపప్పులగ్రామం, అనంతపురం జిల్లా.

ఒక ఊరిలో రవి, శాంత అనే దంపతులు ఉండేవారు. రవి బాగా వ్యాపారాలు చేసి చాలా డబ్బును పోగు చేశాడు. ఈ దంపతులు ఇద్దరూ చాలా పొదుపుగా ఉండేవాళ్ళు. కానీ వీళ్ళ కొడుకు సతీష్ మాత్రం దుబారా మనిషి. స్కూలుకి వెళ్ళడమంటే వీడికి పరమ చిరాకు. రవి, శాంతి సతీష్‌ను ఒక మంచి బడిలో చేర్పించారు; కానీ సతీష్ స్కూలుకు వెళ్తున్నట్టే వెళ్ళి, ఊరి చెరువు కట్ట మీద ఆడుకునేవాడు. అంతేకాదు- వాళ్ళ నాన్న కూడబెట్టిన డబ్బును తీసుకెళ్ళి, ఏవేవో ఆటలు ఆడేవాడు; ఆ డబ్బును పోగొట్టుకునేవాడు.

ఈ విషయం వాళ్ళ నాన్నకు తెలిసి, సతీష్‌ను

కొట్టాడు, తిట్టాడు. "ఇలాంటి పనులు మంచివి కావురా" అని ఎన్నో విధాలుగా చెప్పాడు. "ఇంకొకసారి ఇలా చేస్తే ఇంట్లోంచి గెంటేస్తా- జాగ్రత్త" అని బెదిరించాడు. కానీ సతీష్ ఆ మాటలు పట్టించుకోలేదు. ఒక చెవితో విని, మరొక చెవితో వదిలేశాడు.

సతీష్ స్నేహితుడు మహేష్ అని ఒకడు ఉండేవాడు. "ఇలాంటి పని ఎందుకు చేస్తున్నావురా, నేను స్కూలుకు వెళ్తున్నాను కదా, నువ్వూ నాతో రా, వెళ్దాం. బాగా చదువుకుంటే నీ కాళ్ళమీద నువ్వు నిలబడచ్చు కదా, ఇలా దొంగతనం చేయడం ఎందుకు? వాళ్ళకు నీ మీద ఉన్న ప్రేమను నువ్వే నాశనం చేసుకుంటున్నావు. ఇప్పటికైనా కాలాన్ని వృథా చేయకురా, బాగా చదువుకో" అని చెప్పాడు మహేష్. అతని మాటల్ని కూడా సతీష్ పెడచెవిన పెట్టాడు.

వాళ్ల నాన్న తిట్టినప్పుడల్లా సతీష్ ఏడ్చుకుంటూ ఎక్కడికో వెళ్లిపోయేవాడు. "వాడు ఇక మారడు" అని నిర్ధారించుకొని రవి వాడిని వదిలేశాడు. అట్లా సతీష్ దుబారాగా పెద్దవాడ య్యాడు; కానీ సోమరిపోతుగానే మిగిలిపోయాడు. పెద్దయ్యాక మహేష్ పోలీసు ఇన్‌స్పెక్టరు అయ్యాడు. ఆ ఊరి రౌడీల పట్టికలో సతీష్‌ను చూసి, చాలా బాధ పడ్డాడు.

అతన్ని పిలిచి "సతీష్, ఎలా వున్నావ్ రా! మీ అమ్మ నాన్నలు ఎలా ఉన్నారు?" అని అడిగాడు.

"నన్ను మా అమ్మా, నాన్నలు ఇంట్లోంచి తరిమేసారురా" అని చెప్పాడు సతీష్.



"మరి తమిమెయ్యక ఎలా ఉంటారు? నువ్వు అలాంటి చెడు పనులు చేస్తూంటే

ఎవరైనా అలాగే చేస్తారు. అదే నువ్వు చదువుకుంటే మంచి డాక్టరో, ఇంజనీరో అయ్యేవాడివి! కానీ కాలం విలువ తెలియక అలా చేశావు. ఇప్పటికైనా మీ అమ్మా, నాన్నల దగ్గరికి వెళ్ళు. క్షమించమని వేడుకో. సోమరిపోతుగా ఉండకు. దొంగ పనులు మాని ఏదైనా వ్యాపారం చేసుకో, నేనూ నీకేమైనా సాయం చెయ్యగలనేమో చూస్తాను. అలా కాక చెడుదారినే ఉంటానంటే మటుకు, ఇన్స్పెక్టరుగా నా బాధ్యత నేను నిర్వర్తించాల్సి ఉంటుందని మర్చిపోకు!" అని చెప్పి వెళ్ళిపోయాడు మహేశ్.

మిత్రుడి మాటలు సతీష్‌ని ఆలోచింపజేశాయి. అతని మనసు మారింది. తల్లిదండ్రుల దగ్గరికి వెళ్ళి క్షమాపణలు చెప్పాడు. వాళ్ళ సాయంతో తను కూడా ఒక వ్యాపారం మొదలుపెట్టాడు. నిలకడమీద అందులో విజయం సాధించాడు!

ఫ్రీ!

సత్య, వాళ్ల నాన్న సంతకు పోయారు.

నాన్న: మునక్కాడలు ఎంతమ్మా, కట్ట?

వ్యాపారస్తురాలు: పది రూపాయలు సార్!

సత్య(నాన్న చెవిలో గుసగుసగా): నాన్నా! ఇవి తీసుకుందాం! ఈ మునక్కాడలు కొంటే రబ్బరు బ్యాండ్ ఫ్రీ, చూడు!

కల నిజమాయెగా!

నాన్న (దుప్పటి లాగుతూ) : ఓరేయ్ రాజూ! నిద్రలే రా! తెల్లవారుజామున నిద్రలేచి చదువుకుంటే బాగా జ్ఞాపకం ఉంటాయి!

రాజు: ఉండు నాన్నా! తెల్లవారు జామున వచ్చే కలలు నిజమౌతాయట- నేను పాసయినట్లు చక్కని కల వస్తుంటేను!



అమ్మమ్మ ఊరు

రచన: ప్రవీణ, 6 వ తరగతి, రిషివ్యాలీ స్కూలు, మదనపల్లి, చిత్తూరు జిల్లా.

మా ఊరు పేరు గంగూరు. అది కృష్ణాజిల్లాలో ఉంది- విజయవాడకి గంట దూరంలో. పెద్ద పెద్ద గోడౌన్లు, పచ్చని గడ్డి, ఎద్దులు- వీటిని చూస్తే చాలు- నాకు మా ఊరు గుర్తుకు వస్తుంది. మాకు ఊళ్ళో బోలెడు ఆవులు ఉన్నాయి. అన్నీ 'జర్సీ' జాతి గోవులే. మా ఊళ్ళో అన్నీ నాకు ఇష్టమే. అయితే అక్కడ నాకు నచ్చనిది కూడా ఒకటుంది- ఏమిటంటే, -అక్కడ బోలెడన్ని బల్లులు ఉంటాయి!

రోజూ పొద్దున్న లేచినప్పటినుండీ పిల్లలందరమూ గెంతటం, పరుగెత్తటం, ఆటలాడటం చేస్తూనే ఉంటాము. అందరమూ అంతే- ఒక్క అమ్మమ్మ తప్ప. తను పొద్దున్న నాలుగింటి నుంచి ఏడుగంటల దాకా పూజ చేసుకుంటుంది.

తరువాత వంట గది కెళ్లి నోరూరించే వంటకాలు తయారు చేస్తుంది.

మా తోటలో చాలా చెట్లున్నై. అక్కడికెళ్ళి రోజూ కొబ్బరి చెట్లెక్కటం నేర్చుకుంటాం. కొబ్బరి కాయలు కోసుకొని వాటిలోని నీళ్ళు తాగుతాం. అక్కడి నీటి గుంటల్లో పడి దొర్లుతాం. అక్కడ ఊళ్ళో వాళ్లంతా చాలా బాగా పలకరిస్తారు. భలే మర్యాద చేస్తారు. మా ఊళ్ళో సాయంత్రం పూట వచ్చే చల్లటి గాలులు చాలా బాగుంటాయి. రణగొణ ధ్వనులు, వాతావరణ కాలుష్యం అక్కడ చాలా తక్కువ.

మా అమ్మమ్మవాళ్ళ ఇంటి చుట్టూతా పెద్ద పెద్ద పొలాలు ఉన్నాయి. రాత్రిపూట మేమంతా వాకిట్లో కూర్చొని తాజా కొబ్బరి నీళ్ళు తాగుతూ, చందమామను చూస్తూ, అమ్మమ్మ చెప్పే కథలు వింటూ, పడుకుంటాం- ఎంతో హాయిగా ఉంటుంది!!

ఆహా! ఇవన్నీ చెబుతుంటే నాకు మా ఊరు, అమ్మమ్మ, తాతగారు, ఊళ్ళోవాళ్ళు అందరూ గుర్తుకు వస్తున్నారు. మీరూ రండి మరి, అందరం వెళ్దాం!

పూలకుండీ!

రవి:సోమూ! ఏంటిరా తలకు బ్యాండేజీ కట్టావు?

సోము: మా ఆవిడ నా మీదికి పూలు విసిరిందిరా!

రవి: పూలు విసిరితే అంత దెబ్బ తగిలిందా?

సోము: ఆ పూల కింద పూలకుండీ కూడా ఉందిగా, దాంతో తల పగిలింది మరి!

సూరి తోట

రచన: యస్. కుమారి, 6 వతరగతి, ప్రకృతిబడి.






సూరికి అందమైన తోట ఒకటి ఉండేది. ఆ తోటలో రకరకాల పక్షులు ఉండేవి. అతను రోజూ తోటకు వెళ్ళి చెట్లకు నీళ్ళు కట్టి వచ్చేవాడు. ఒక రోజు తోటకి పోయి చూస్తే తోటంతా నిశ్శబ్దంగా ఉంది. పక్షులన్నీ మూగపోయి ఉన్నాయి.

"రోజూ ఎన్ని పక్షులు ఉండేవి! ఈ రోజు తగ్గిపోయినట్లున్నాయే! ఎవరో ఈ పక్షులను తినేస్తున్నారు. పట్టుకోవాలి" అనుకొని, సూరి ఆ రాత్రికి తోటలోనే పడుకున్నాడు.




రాత్రి 9 గంటల ప్రాంతంలో పెద్ద గ్రద్ద ఒకటి వచ్చింది ఎక్కడినుండో. వచ్చీ రాగానే అది ఒక పక్షిపిల్లని తినేసింది! దాన్నే గమనిస్తున్న సూరి కోపం పట్టలేక ఆ గద్ద మీదికి దూకాడు. తన చేతిలో ఉన్న కట్టెతో దాని ముఖానికి నాలుగు అంటించాడు.

అయితే అది మామూలు గ్రద్ద కాదు- సూరితో సహా ఆకాశంలోకి ఎగిరింది అది. పోయి పోయి ఒక సముద్రంలోకి దూకింది!




గద్ద మీద ఉన్న సూరి కూడా సముద్రంలోకి జారిపోయాడు. గ్రద్ద ఎక్కడికి వెళ్ళిందో తెలీదు. సూరి మటుకు ఈదుకుంటూ ఒక దీవిని చేరుకున్నాడు. ఆ ప్రదేశం చాలా అందంగా ఉంది. చాలా చెట్లు, మొక్కలు, తీగలు దట్టంగా పెరిగి ఉన్నై.




అంతలో అకస్మాత్తుగా అతనికి ఒక ఎలుగుబంటి అతనికి ఎదురైంది!

దాన్ని చూసి సూరి చాలా భయపడ్డాడు. కానీ అది వాడితో తెలుగులో మాట్లాడింది! "భయపడకు" అని అది సూరి చెయ్యిపట్టుకొని తమ ఇంటికి తీసుకుపోయింది వాడిని.



అక్కడికి వెళ్లగానే ఎలుగుబంటి అన్నది- "సూరీ! నాకు ఆకలివేస్తున్నది. మీ మనుషులు అన్నన్ని వంటలు చేసుకుంటారు కదా, నాకు ఏమైనా చేసిపెడతావా?" అని అడిగింది. సూరి ఇంకా భయపడుతూనే ఉన్నాడు. "సరేలే, ఇలా అయితే నువ్వు నాకు ఆహారం పెట్టలేవు గానీ, ఏదైనా మంచి హోటల్‌కి పోదాం, రా!" అని పిలిచిందది.

"ఇదేమి ఎలుగుబంటి, ఇక్కడేం హోటలు " అని భయపడుతూనే సరేనన్నాడు సూరి. అలా పోతూవుంటే దారిలో ఇటుప్రక్కన ఒక పే..ద్ద గ్రద్ద ఒకటి కనిపించింది. దాన్ని వెంటనే గుర్తుపట్టాడు సూరి. మరుక్షణం ఎలుగుబంటి చెయ్యి పట్టుకొని హోటల్‌లోకి పరుగుతీశాడు. "ఏమయింది, ఇంత తొందరపడుతున్నావు?" అంది ఎలుగుబంటి.



"ఇందాక అక్కడ ఉందే, ఆ గ్రద్దే, మా ఊరికి వచ్చేది! అది నా తోటలో పక్షులన్నిటినీ తినేస్తోంది! దాన్ని తరుముకుంటూనే నేను ఇక్కడికి వచ్చాను!" అన్నాడు సూరి.

"ఓ అదా! అది చాలా తుంటరిది! దానిమీద ఇప్పటికే చాలా కేసులు ఉన్నాయి. రేపు కోర్టులో చెబుదాంలే, దాని సంగతి!" అన్నది ఎలుగుబంటి.

తెల్లవారగానే ఇద్దరూ కోర్టుకు పోయారు.




ఎలుగుబంటి కోర్టులో చెప్పింది: "మన ప్రాంతంలో ఉండవలసిన గ్రద్ద వేరే ప్రాంతానికి పోయింది; అక్కడ ఉన్న పక్షులను తింటోంది; తిరిగి ఇక్కడికి వస్తున్నది. దీనికి తమరు తగిన శిక్ష విధించాలి యువరానర్!" అని.

జడ్జిగారు అడిగారు: "ఆ గ్రద్ద ఇదేనని ఎలా గుర్తుపడతారు?"అని.

సూరి ముందుకు వచ్చి చెప్పాడు: "నిన్న కట్టెతో ఆ గ్రద్ద కంటిమీద ఒక దెబ్బ వేశాను. ఇద్దుగో, ఇప్పటికీ ఆ గుర్తు ఉంది- చూడండి!

జడ్జి గారికి కోపం వచ్చింది. "ఆర్డర్ ఆర్డర్! ఈ దొంగ గ్రద్దకొక ఆరు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తున్నాం" అన్నారు.




వచ్చిన పని పూర్తి కాగానే సూరికి ఇంట్లోవాళ్లంతా గుర్తుకొచ్చారు. "నా కోసం మా వాళ్ళు ఎదురుచూస్తుంటారు. ఎలుగుబంటీ, ఇప్పుడు సముద్రం దాటి ఎలా వెళ్ళను? అడిగాడు సూరి.

"మా సీతాకోక చిలుక ఉందిగా, దానిమీద ఎక్కి పోవచ్చులే" అని ఎలుగుబంటి సీతాకోక చిలుకను రమ్మన్నది.



సూరి ఆ సీతాకోకచిలుక మీద ఎక్కి, అందరికీ నమస్కారం పెట్టి బయలు దేరాడు.

ఇంటికి రాగానే సూరి వాళ్ళ అమ్మ "ఎక్కడికి పోయినావురా, ఇన్నాళ్ళూ!" అంటూ ఏడ్చింది.




"ఏమీ లేదమ్మా! ఓ దొంగ గ్రద్ద వచ్చి మన తోటలోని పక్షులను తింటుంటేనూ, ఆ గ్రద్దని చంపేసేందుకు వెళ్ళాను" చెప్పాడు సూరి నిజాయితీగా.

"మరి ఇన్ని రోజులు పోయావేరా?" అడిగింది అమ్మ.

"అటునుండి అటు మా ఫ్రెండ్ వాళ్ల ఇంటికి పోయాను; వాడి పుట్టినరోజు కదా!" అన్నాడు సూరి.

నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది



ఎక్కడినుండి ఎక్కడికి!

సొంత కథలు రాయాలంటే ఇదిగో, ఇలా ఓ గొలుసు కథ మొదలు పెట్టుకోండి- బాగుంటుంది. గణేష్ రాసిన ఈ గొలుసు కథ నిజానికి అసంపూర్ణమే. ఇలా కాక మరెలా ఉంటే బాగుంటుందో మీరే ఆలోచించి చెప్పేసుకోండి, అలా మరో కథ తయారవుతుంది!

రచన: గణేష్, 523, *వికాస విద్యావనం, పోరంకి, విజయవాడ.* *పున:కథనం: కొత్తపల్లి.*

చాలా రోజుల క్రితం ఒక ఊళ్లో రంగారావు అనే యువకుడు ఒకడు ఉండేవాడు. పట్నంలో అతనికి ఓ చిన్న స్థలం ఉండేది. అందులో కనీసం ఒక్క గదైనా కట్టాలని అతనికి బలే కోరిక. పట్నంలో గది కట్టాలంటే కనీసం పది వేల రూపాయలైనా ఉండాలి. కానీ రంగారావు దగ్గర ఏనాడూ అంత డబ్బు జమ కాలేదు.

ఒక రోజున రంగారావు పొలం దున్నుతున్నాడు. అకస్మాత్తుగా అక్కడ అతనికి ఒక బంగారు నాణెం దొరికింది. "అబ్బ బంగారు నాణెం! దీంతో నా అవసరాలన్నీ తీరతాయి!" అనుకొని అతను పని ఆపి, దాన్ని

జేబులో వేసుకొని ఇంటికి బయలు దేరాడు.

ఇంటికిపోతుంటే, దారి మధ్యలో ఒక ముసలాయన ఎదురు పడ్డాడు రంగారావుకు. ఒక గాడిదను తోలుకొని వస్తున్నాడాయన. "నాయనా! చాలా ఆకలిగా ఉంది. రెండు రోజులుగా ఏమీ తినలేదు. నీకు మేలు జరుగుతుంది- నీ దగ్గర ఏమైనా ఉంటే దానం చెయ్యి బాబూ" అన్నాడు ముసలాయన, రంగారావుతో.

సంతోషంగా ఉన్న రంగారావుకు అబద్ధం చెప్ప బుద్ధి కాలేదు. "పోనీలే, ఇది నాకు దొరకలేదనుకుంటాను" అని అతను తన జేబులోని బంగారు నాణెం తీసి ఆ ముసలాయనకి ఇచ్చేశాడు.

"చాలా గొప్ప పని చేశావు నాయనా, దీనితో నా అవసరం నెరవేరుతుంది. ఇదిగో, ఈ గాడిద చాలా మంచిది. దీన్ని నువ్వు తీసుకెళ్ళు" అని ఆ ముసలాయన తన గాడిదను రంగారావుకు ఇచ్చి ముందుకు సాగాడు.

రంగారావుకు ఆ గాడిదను ఏం చెయ్యాలో అర్థం కాలేదు. వద్దన్నా వినేట్లు లేదు, ముసలాయన. అందుకని అతను దాన్ని తోలుకొని ఇంటికి పోయాడు.

ఇంటికి పోయేసరికి అక్కడ పరిస్థితి గందరగోళంగా ఉన్నది. వాళ్ల పక్కింటి వాళ్ళు వేరే ఏదో ఊరికని బయలు దేరి ఉన్నారు. తీరా సమయానికి బండి జాడ లేదు!

"దానిదేముంది, ఇదిగో ఈ గాడిద ఉంది కదా, మీ సామాన్లను దీనిమీద తీసుకెళ్దాం, రండి" అని రంగారావు వాళ్ల సామాన్లన్నిటినీ పొరుగూరు చేర్చాడు. వాళ్ళు చాలా సంతోషపడి, అతనికి ఒక వందరూపాయలు ఇచ్చి, భోజనం కూడా పెట్టి పంపారు.

వెనక్కి వస్తూ ఒకచోట విశ్రాంతిగా కూర్చున్నాడు రంగారావు. అంతలోనే ఒక చిన్న పిల్లవాడి ఏడుపులూ, వాళ్ల అమ్మ అరుపులు వినపడ్డాయి. రంగారావుకి జాలివేసింది. "పిల్లవాడు ఎందుకు ఏడుస్తున్నాడమ్మా?" అని అడిగాడు. "చూడు నాయనా, మా బండి చక్రం విరిగి అవతల ఎక్కడో నిలిచి పోయింది. నడక తప్పితే ఇక వేరే మార్గం లేదు మాకు. వీడేమో

నడవనని మారాం చేస్తున్నాడు" అంది ఆ తల్లి.



"అయ్యో, దానిదేముందమ్మా, నా గాడిద మీద కూర్చోబెట్టండి వాడిని. చిటికెలో అందరం పట్నం చేరుకుందాం" అన్నాడు రంగారావు ఆ పిల్లవాడిని సముదాయిస్తూ. పిల్లవాడు సంతోషంగా గాడిదనెక్కి కూర్చున్నాడు. పట్నం చేరాక వాళ్ల నాన్న రంగారావుకు బలవంతంగా వందరూపాయలు ఇవ్వటమే కాక, "నీకు ఏ అవసరం వచ్చినా నన్ను అడుగు, సంకోచించకు" అని మాట కూడా ఇచ్చాడు.

"ఏదైనా ఒక చిన్న పని ఇప్పించారంటే, మీ పేరు చెప్పుకొని బ్రతుక్కుంటాను" అన్నాడు రంగారావు వినయంగా. "పనిదేముంది, మన సైకిల్ షాపులోనే పని చెయ్యి. నీ పనిని బట్టి ఎంతో కొంత జీతం ఇస్తానులే" అన్నాడు ఆ పెద్దమనిషి!

అలా రంగారావు సైకిల్ షాపులో పనికి కుదురుకున్నాడు; వళ్ళు వంచి ఇష్టంగా పని చేయటం మొదలు పెట్టాడు. నెల తిరిగేసరికి రంగారావుకి రెండువేలు జీతంగా ఇచ్చాడు షాపు యజమాని. "అంత డబ్బు వద్దండీ, ఖర్చులకు ఎంతో కొంత ఇవ్వండి చాలు" అన్నాడు రంగారావు. యజమాని అతనికి ఖర్చులకు డబ్బు ఇచ్చి, మిగతా సొమ్మును అతని పేరనే బ్యాంకులో వేశాడు.

సంవత్సరం తిరిగే సరికి రంగారావు పేర బ్యాంకులో ఇరవైవేల రూపాయలు జమ అయ్యాయి. ఆ డబ్బుతో అతను తన స్థలంలో చిన్న ఇల్లు ఒకటి కట్టుకోగలిగాడు!

కథలో కథ

నేరుగా ఏ కథా దొరక్కపోతే, కథలో కథ దొరుకుతుందట. ఇదిగో, ఇలాగన్నమాట, చదివి చూడండి! ఎటొచ్చీ అభివరుణ్ బొమ్మలో ఉన్న గాడిదను మర్చిపోయినట్లున్నాడు- అది తప్పిపోయింది; కథలోకి రాలేదు.



రచన: అభివరుణ్, 512, వికాసవిద్యావనం, పోరంకి, విజయవాడ.



ఒకరోజు సాయంత్రం అవ్వ, అమ్మ, బాబు చెరువు గట్టుమీద నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నారు. చెరువులో చాలా అందమైన పువ్వులు ఉన్నాయి. సూర్యుడు అప్పుడే అస్తమిస్తున్నాడు. వాతావరణం చాలా బాగున్నది. "అవ్వా, అవ్వా! ఓ మంచి కథ చెప్పవూ?" అని అవ్వ దగ్గరికి వెళ్ళాడు బాబు. "ఇక్కడ కూర్చొని కథలు చెప్పుకుంటూంటే చీకటి పడిపోదూ? ఇంటికెళ్ళాక చెప్పుకుందాంలే" అంది అవ్వ. "కాదు, ఇప్పుడే ఓ చిన్న కథ చెప్పు, రాక్షసుడి కథ" అని పట్టు పట్టాడు బాబు. అమ్మ, బాబు చెట్టుకింద కూర్చొని కథ వింటుంటే, అవ్వ కథ చెప్పటం మొదలుపెట్టింది ఇలాగ-

"అనగనగా ఒక రాజ్యంలో ఒకరాజు ఉన్నాడు. అతను చాలా మంచివాడు. ప్రజలకి సాయం చేస్తూఉంటాడు. ఒకరోజున ఆ రాజ్యంలోకి ఒక పెద్ద రాక్షసుడు వచ్చి ప్రజలను తినడం మొదలుపెట్టాడు. రోజుకో ఇంటికి వెళ్ళి తనకిష్టమైన వారిని తింటున్నాడు వాడు.

అట్లా ఒకరోజున వాడు రాజు గారి ఇంటికి వెళ్ళి "నాకు ఆకలిగా ఉంది- నీ కూతురు కావాలి" అన్నాడు. అంత పెద్ద రాక్షసుడిని చూసి రాజుకూడా భయపడ్డాడు. వాడికి ఏం సమాధానం చెప్పాలో కూడా అర్థం కాలేదు ఆయనకు. అప్పుడు రాక్షసుడే అన్నాడు- నీ బిడ్డని రక్షించుకునేందుకు నీకు ఒక అవకాశం ఇస్తాను. నేను ఒక ప్రశ్న అడుగుతాను. దానికి సరైన సమాధానం చెబితే నీ కుమార్తెను వదిలివేస్తాను. తప్పు సమాధానం చెప్పిన వాళ్ళని నాకు ఆహారంగా ఇవ్వాలి నువ్వు" అని చెప్పాడు రాక్షసుడు.

రాజు "సరే ఆ ప్రశ్న ఏమిటో అడుగు" అన్నాడు.

"పొద్దున నాలుగు కాళ్లతో నడుస్తుంది, మధ్యాహ్నం రెండుకాళ్ళతో నడుస్తుంది, రాత్రి మూడు కాళ్ళతో నడుస్తుంది- ఏమిటది?" అడిగాడు రాక్షసుడు. రాజుకు ఆ ప్రశ్నకు సరైన సమాధానం తెలియలేదు . తెల్ల మొఖం వేశాడు. రాక్షసుడు నవ్వాడు- "పో, మరి దీనికి సరైన సమాధానం చెప్పమని ఊరంతా దండోరా వేయించు" అన్నాడు.

రాజ్యంలో ఎవ్వరికీ ఆ ప్రశ్నకు సరైన సమాధానం తెలియలేదు. తప్పు సమాధానం చెప్పినవాళ్లను అందరినీ రాక్షసుడు భోంచేసేడు. రాజ్యంలో ఉన్న పెద్దవాళ్ళు, యువకులు సగం మంది రాక్షసుడికి భోజనం అయిపోయారు. "ఎలాగబ్బా, వీడిని ఓడించేది ఎవరు?" అని రాజు ఆలోచనలో పడ్డాడు.

చివరికి ఒకబాబు ముందుకు వచ్చాడు- "నీ ప్రశ్నకు సమాధానం నేను చెప్తాను. అది తప్పైతే నువ్వు ఎలాగూ నన్ను తినేస్తావు. మరి ఒకవేళ అది సరైన జవాబు అయితేనో?" అన్నాడు.

"నీలాంటి బుడతల్ని చాలా మందిని చూశానురా, దీనికి సరైన సమాధానం నువ్వు ఊహించలేవు. అయినా ఒకవేళ నీ జవాబు సరైనదే అనుకో, అప్పుడు నేను ఈ లోకం నుండే వెళ్ళిపోతాను- సరేనా?" అన్నాడు రాక్షసుడు గర్వంగా.

ఆ బాబు చెప్పాడు: "నీ ప్రశ్నకు సమాధానం- 'మనిషి' " అని. "మనిషి తన జీవితం ప్రారంభంలో నాలుగు కాళ్లమీద పారాడతాడు.

నడిమి వయసులో రెండు కాళ్లమీద నడుస్తాడు. ఇక ముసలితనం వచ్చేసరికి కట్టె పట్టుకొని మూడుకాళ్లతో మళ్ళాడుతాడు- అంతేగా?" అన్నాడు.

ఆ సమాధానం సరైనదేగదా, మరి రాక్షసుడు తను ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. అందుకని వాడు కొండపైకి ఎక్కి ఒక పెద్ద రాయికి తన తలని గుద్దుకుని చచ్చిపోయాడు. రాజు, రాజ్యంలోని వాళ్లందరూ ఆ బాబుని మెచ్చుకున్నారు.


అవ్వ కథ ముగించి చూసేసరికి చంద్రుడు వచ్చేశాడు- బాబు, వాళ్ళ అమ్మ ఇద్దరూ చందమామని చూస్తూ ఆ చెరువు గట్టునే నిద్రపోయి ఉన్నారు!

ఎంతెంత దూరం? మరుమల్లె గంధమా!
కొద్ది కొద్ది దూరం!
ఎంతెంత దూరం? ఘుమ్మను గులాబి పరిమళమా!
కొద్ది కొద్ది దూరం!
ఎంతెంత దూరం! నంది వర్ధన పరిమళమా!
కొద్ది కొద్ది దూరం!
ఎంతెంత దూరం? సాధు సత్పురుషుల శీల గంధమా!
దేవలోకమంత దూరం!

ఏ పువ్వుల వాసనైనా కొంత దూరమే వ్యాపిస్తుంది. కానీ సాధు సత్పురుషులకు శీలం వలన కలిగే కీర్తి దేవలోకం వరకూ వ్యాపిస్తుంది.



"ధమ్మపదం"
అనువాదం, చిత్రం:
శ్రీ తియ్యగూర సీతారామరెడ్డి గారు,
విజయవాడ.



గాడిద బ్రతుకు

రచన: కృష్ణవేణి, 7 వతరగతి, మారిగోల్డ్, అరవింద హైస్కూల్, కుంచనపల్లి.

అనగనగా ఒక ఊరిలో ఒక అమ్మ, అవ్వ, బాబు ఉండేవారు. ఒక రోజు వాళ్ళు ముగ్గురూ ప్రక్క ఊరికి బయలుదేరారు. దారిలో వాళ్లకు ఒక గాడిదపిల్ల కనిపించింది.

బాబు అన్నాడు "అమ్మా! ఈ బుజ్జి గాడిద చూడు ఎంత అందంగా ఉందో! మనం దీనిని పెంచుకుందామా?" అని.

"సరే అట్లాగే కానివ్వురా, నీ ఇష్టం" అన్నది అమ్మ.

గాడిదను కూడా వాళ్ళు తమతోపాటు తీసుకువెళ్ళారు. దానికి ఏ పనులూ చెప్పకుండా ముచ్చటగా చూసుకునేవాళ్ళు వాళ్ళు. కొన్ని రోజులకు అది కొంచెం పెద్దది అయ్యింది.

అంతవరకూ వాళ్లమీదే ఆధారపడి బ్రతికిన ఆ గాడిదకు పెద్దవ్వగానే వేరే ఆలోచనలు

మొదలయ్యాయి- అది తన మనస్సులో అనుకుంది-"ఏంటి ఇది? నేను ఒకలాగా ఉన్నాను, వీళ్ళు ఒకలాగా ఉన్నారు! అసలు నేను ఎవరిని, వీళ్ళు ఎవరు? వీళ్ళేమో ఇడ్లీలు- దోశెలు తింటారు; నాకేమో గడ్డీ, గాదం తినిపిస్తారు. సరిగ్గా తిండి కూడా పెట్టరు; పైపెచ్చు నాతో పని చేయించుకుంటారేమో ఇంక!" అని అనుకుంది.

దాంతో దానికి బాధ మొదలైంది. 'తనని ఎవ్వరూ ప్రేమించటం లేదు; తన శ్రమను మాత్రం దోచుకుంటారు' అనుకున్నదది. "నేను ఈ రోజు రాత్రి ఎక్కడికైనా వెళ్ళిపోయాననుకో, మరి వాళ్ళు నన్ను వెతుకుతారా, వెతకరా?" అని సందేహించి, అది ఒక రోజున కట్లు తెంచుకొని బయట పడింది. తన తెలివితేటలన్నీ ఉపయోగించి ఒక రోజంతా ఎవ్వరికీ కనపడకుండా ఒక చోట దాక్కున్నది.

బాబు గాడిదకోసం చాలా వెతికాడు; కానీ వాడికి అది కనబడితేగా? గాడిద ఏమైందో ఎవ్వరికీ తెలియలేదు.

"చూశావా, ఎవ్వరూ నాకోసం వెతకను కూడా వెతకలేదు! అంటే వీళ్ళెవ్వరికీ నామీద ప్రేమలేదన్న మాట. కేవలం పనికి మాత్రమే వాడుకుంటారన్నమాట నన్ను!" అనుకొని గాడిద వాళ్ళనుండి దూరంగా పారిపోయింది.

ఆ తర్వాత అది చాలా మంది దగ్గరికి వెళ్ళింది. దాన్ని దగ్గరికి తీసినవాళ్ళంతా దాని చేత చాకిరీనే చేయించుకున్నారు. పాపం ఎవ్వరూ దానికి ఏనాడూ ఇడ్లీలూ, దోసెలూ పెట్టనే లేదు!

తెలివికి జోహార్లు!

కార్తీక్: ఓ, పెద్దాయనా! బస్సులో "పొగత్రాగరాదు" అని రాసి ఉందిగా! మరి నువ్వు ఏం చేస్తున్నావు?

పెద్దాయన:నేను పొగత్రాగటం లేదు నాయనా, పొగ వదులుతున్నాను!

గోపి కల

రచన: తేజస్విని, 521, వికాస విద్యావనం, పోరంకి, విజయవాడ.

అనగనగా ఒక ఊర్లో 'గోపి' అనే పిల్లవాడు ఉండేవాడు. గోపి బొమ్మలు చాలా బాగా వేస్తాడు. గోపికి ఒక చెల్లి ఉంది. ఆ పాప పేరు హరిత. గోపి 6 వతరగతి చదువుతున్నాడు. హరిత 3 వతరగతి చదువుతున్నది.

ఒక రోజు రాత్రి గోపి, హరిత, వాళ్ల అమ్మ అందరూ పడుకున్నారు. అప్పుడు గోపికి ఒక కల వచ్చింది:

అది ఏమిటంటే, "ఒక ఊరు ఉందట. ఆ ఊరు నది పక్కన ఉందట. ఆ ఊరిలో ఒక పూరిగుడి సె ఉంది. అందులో ఒక అవ్వ, అమ్మ, బాబు ఉండేవాళ్లు. వాళ్ళకి ఒక గాడిద కూడా ఉండేది. ఒక రోజు పెద్ద తుఫాను ఒకటి వచ్చింది. విపరీతంగా వర్షం కురిసింది. వాళ్ళుండే పూరిగుడిసె లోకి నీళ్ళు రావటం మొదలుపెట్టాయి. అప్పుడు అమ్మ, అవ్వ, బాబులకు ఏమిచెయ్యాలో అర్థం కాలేదు. ఇక ఆ ఊరు విడిచిపెట్టి పోవడానికే నిశ్చయించుకున్నారు వాళ్ళు. తమతో పాటు గాడిదను కూడా వెంట తీసుకుపోయారు. అట్లా పోతూ పోతూ వాళ్ళు గోపి వాళ్ళ ఇంటి ముందునుండే పోతున్నారు.



కిటికీలోంచి వాళ్ళని చూసాడు గోపి- "ఇదేంటి, వీళ్ళు ఎక్కడికి పోతున్నారు, ఇంత వానలో?"

అనుకొని, వాళ్ళని తమ ఇంట్లోకే పిలిచాడు. తాము ఉండే చిన్న ఇంట్లోనే వాళ్ళకీ ఉండేందుకొక చోటు చూపించాడు" అంతలో కల అయిపోయింది. గోపికి మెలకువ వచ్చేసింది కూడా.

మరుసటి రోజున గోపి తన కలకి సంబంధించి మంచి బొమ్మనొకదాన్ని వేశాడు. బొమ్మ చక్కగా వచ్చింది. 'కానీ దాన్ని ఏం చెయ్యాలి?' అప్పుడు గుర్తుకొచ్చింది వాడికి- "రేపు రాఖీపండుగ కదా, హరిత నాకు రాఖీ కట్టిన తర్వాత నేను తనకు ఈ బొమ్మనే బహుమతిగా ఇస్తే భలే బాగుంటుంది!"

మరునాడు గోపి అనుకొన్నట్టే "అన్నా, ఇటు రారా" అని పిలిచి రాఖీ కట్టింది హరిత. గోపి నవ్వి, తను గీసి పెట్టిన ఆ బొమ్మను హరితకు కానుకగా ఇచ్చాడు.

హరితకి ఆ బొమ్మ ఎంత బాగా నచ్చిందంటే చెప్పలేం! అప్పటినుండీ హరితకు గోపికి పండుగ అంటే రాఖీపండగే. ప్రతి సంవత్సరం రాఖీ పండుగ కోసం ఎదురుచూస్తూంటారు వాళ్ళిద్దరూ. హరిత తను సొంతగా తయారు చేసిన రాఖీలు కడుతుంటుంది; గోపీ తను గీసిన బొమ్మల్ని చెల్లికి కానుకగా ఇస్తుంటాడు!

ఆ 64 ఎవరివి?

ఇంద్ర:నా గురించి ఇంకొక్క మాట మాట్లాడావంటే నీ 32పండ్లూ రాలకొడతాను.

నవీన్: నన్నేమన్నా అన్నావంటే 64పండ్లూ రాలకొడతాను చూడు.

మధ్యవర్తి: అతనికి ఉన్నది 32పండ్లే కదా! మరి 64పండ్లు ఎలా రాలగొడతావు?

నవీన్: వాడివీ,నీవీ కలిపితే అరవైనాలుగు అవుతాయి-నువ్వు ఊరుకోవయ్యా బాబూ!

జీవనాధారం

రచన: జె.రాజేశ్వరి, 7 వతరగతి, మ్యారీగోల్డ్, అరవింద హైస్కూలు, కుంచనపల్లి.



అనగనగా ఒక కమలమ్మ, ఆమె కొడుకు రాము ఉండేవాళ్ళు. ఒక ముసలి అవ్వ తప్పిస్తే వాళ్లకు నా అన్నవాళ్ళే ఎవరూ ఉండేవాళ్ళు కారు. ఒకసారి వాళ్ళుండే ఊళ్ళో విపరీతమైన కరువు వచ్చింది. దాంతో వాళ్ళు వేరే ఊరికి వలస పోవలసి వచ్చింది.

అట్లా వాళ్ళు దోవ వెంబడి పోతూ ఉంటే దారిలో వాళ్లకొక గాడిద కనిపించింది. దాని యజమానులెవరో దాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయినట్లున్నారు; అది బక్క చిక్కిపోయి, ఆకలికి నకనకలాడుతున్నట్లు ఉంది, బలహీనంగా. దాన్ని చూడగానే రవి చాలా ముచ్చటపడ్డాడు. "ఆ గాడిదను పెంచుకుందాం అమ్మా" అని అడిగాడు. కమలమ్మ ఒప్పుకోలేదు. "తింటానికి మనకే ఏమీ లేదు; ఇంక దాన్నెట్లాగ, సాకేది?" అన్నది.

కానీ రాము బ్రతిమిలాడాడు. దాంతో కొద్ది సేపటికి ఆమె మెత్తపడి "సరే, కానియ్యి. కానీ దాన్ని చూసుకునే బాధ్యత నీదే. అది చచ్చిపోతే మటుకు నన్ను ఏమీ అనకు" అంది.

రాము సంతోషంగా పోయి దాన్ని వెంట పెట్టుకొని వచ్చాడు. అక్కడక్కడా నిలచి ఉన్న చెట్లలోంచి కొన్ని ఆకుల్ని కోసి దానికి

తినిపించాడు. అది వాటిని నములుతూ, వాళ్ళవెంట నడవసాగింది. కొద్ది దూరం పోయాక రాము తన నెత్తి మీద ఉన్న మూటను దాని మీదే వేశాడు- అది అలవోకగా ఆ బరువును మోస్తూ పోయింది.

రాము వాళ్ళు ఎంత దూరం పోయినా కరువు ఛాయలు పోనే లేదు. చివరికి వాళ్ళు ఏదో ఒక ఊరు చేరుకున్నారు. ఆ సరికి సాయంత్రం కావస్తున్నది. అవ్వ, కమలమ్మ ఇద్దరూ ఒక చెట్టుక్రింద బిచాణా పరచి, మూడు రాళ్ళ పొయ్యిలో వంట మొదలుపెట్టారు.

అంతలో ఊళ్ళోంచి ఒకాయన వచ్చి వాళ్ళ ముందు నిలబడి, "ఊళ్ళో చాకలి వాళ్ళు లేక చాలా కష్టంగా ఉంది- మీరు వచ్చారు గనక ఇక బాధే లేదు. రేపు ఉదయాన్నే మా బట్టలొక ఇరవై పంపుతాను- ఉతికి త్వరగా వెనక్కి ఇచ్చేయాలి మరి" అన్నాడు.

కమలమ్మకు ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు- ఎందుకంటే వాళ్ళు అసలు చాకలివాళ్ళు కాదు గద! ఉన్న ఊళ్ళో గడవక, కడుపు చేతబట్టుకొని వచ్చారు వాళ్ళు. అయితే తమతోబాటు ఉన్న గాడిదను చూసి ఆయన అట్లా అనుకున్నట్లుంది. 'ఏదో ఓ బ్రతుకు తెరువు- బట్టలు ఉతికితే కాసిని డబ్బులు వస్తాయి కదా, బ్రతుక్కోవచ్చు' అని ఆమె "సరేలెండి సార్! అలాగే కానివ్వండి" అన్నది.

మరునాటికల్లా ఊళ్ళో అందరికీ తెలిసింది- 'ఎవరో చాకలివాళ్ళుట, వచ్చి ఉన్నారు- బట్టలు బాగా ఉతుకుతారట! ఏ కాసిని డబ్బులు ఇచ్చినా చాలట!' అని. ఇక అందరూ వాళ్ల వాళ్ల బట్టలు తెచ్చి వేయటం మొదలు పెట్టారు. కమలమ్మ కు, అవ్వకు చేతినిండా పని దొరికింది. రెండు మూడు రోజుల్లో గాడిద బాగా కోలుకున్నది కూడాను. బాగా అనుభవం ఉన్న గాడిద అవ్వటంతో అది వీళ్లకు చాలా సేవ చేసింది. అమ్మ, అవ్వ, రాము ముగ్గురూ ఒళ్ళు వంచి పని చేశారు. రాము గాడిదను వెంటబెట్టుకొని వెళ్ళి ఇంటింటినుండీ బట్టలు సేకరించుకొని వచ్చేవాడు. అట్లాగే ఉతికిన బట్టలు తీసుకెళ్ళి ఇచ్చేవాడు. అమ్మ, అవ్వ ఇద్దరూ వంక దగ్గర బట్టలు ఉతకటం మొదలు పెట్టేసారు.

కరువు కారణంగా ఎలా బ్రతుక్కోవాలో అర్థంకాక వలస పోయిన ఆ కుటుంబానికి ఇప్పుడు మూడుపూట్ల భోజనం దొరకటం మాత్రమే కాదు- ఒక్క సంవత్సరంలో సొంత ఇల్లు కూడా ఏర్పడింది. మరుసటి సంవత్సరం నుండీ రాము బడికి వెళ్ళి చదువుకోవటం కూడా మొదలుపెట్టాడు.

అంతేకాదు; ఇప్పుడు వాళ్ళకు జీవితం అంటే భయం పోయింది-తమ శక్తి యుక్తుల పట్ల గౌరవం ఏర్పడింది. ఇప్పుడు వాళ్ళు ఎక్కడికెళ్ళినా చాకలి పని చేసుకొని పొట్టపోసుకోగలరు. 'దేనికీ పనికి రాదు' అనుకున్న గాడిదే ఇప్పుడు వాళ్ళకి జీవనాధారమూ, జీవన స్ఫూర్తీ అయ్యింది!

ధమ్మపదం

ఓటి కుండ బతుకులోన ఓపికంత
వొలికి పోవగ వ్యర్థుడు వగచుచుండు.
శీలములు లేక ధర్మపు సిరులు రావు.
శుద్ధ ధర్మపద మిదియె శుభములిచ్చు!

మంచిగుణాలు లేకుండా దురలవాట్ల పాలైన వాని ఆరోగ్యం పాడైపోతుంది. చిల్లి కుండలో నీరు కారిపోయినట్లు దుశ్శీలుని శరీరం రోగాల పాల బడటం వలన అతని శక్తి అంతా క్షీణిస్తుంది. శీలం లేక పోతే ధర్మ సిరులైన శాంతి, సుఖము, మైత్రి, ప్రేమ లభించవు.

అనువాదం: శ్రీ తియ్యగూర సీతారామరెడ్డి, విజయవాడ

తిరిగి కలిపిన బొమ్మ



రచన: మధుమిత, 502, వికాసవిద్యావనం, పోరంకి, విజయవాడ.

"రామూ! త్వరగా రెడీ అవ్వు" అని అమ్మ అంది. "మనం చాలా దూరం వెళ్లాలి- తొందరగా రెడీ అవ్వు!"

"అమ్మా, మనం ఎక్కడికి వెళ్తున్నాము?"

ముందుగా మనం అత్తవాళ్ళ ఇంటికి వెళ్తాం; అక్కడ నుండి ఢిల్లీవెళ్లాలి. ఎందుకంటే అక్కడ మీ నాన్నకి మంచి ఉద్యోగం దొరికింది కదా! మనం కూడా అక్కడికే పోతున్నాం!" సంతోషంగా అన్నది అమ్మ.

అదిగో, అంతలోనే ఏదో కారురానే వచ్చింది! "మనల్ని తీసుకెళ్ళేందుకేనేమో!"

అయితే కారు ఆగగానే అందులోంచి మాకు ఇద్దరికీ తెలీనివాళ్ళెవరో దిగారు. ఒకాయన అమ్మ దగ్గరికి వచ్చి అన్నాడు- "మీ పేరు సుభద్రా?" అని.

"అవునండీ" అన్నది అమ్మ.

మీరు ఈ బొమ్మను ఏమైనా గుర్తుపట్టగలరా?" అడిగాడతను, ఒక బొమ్మను చూపిస్తూ.

నేను ముందుకు వంగి చూసాను. "అది అమ్మ వేసిన బొమ్మే! చిన్నప్పుడు అమ్మ వాళ్ళు వేరే ఒక మారుమూల పల్లెలో ఉండేవాళ్లట. అమ్మ, వాళ్ళ అవ్వ, వాళ్ల గాడిద- అందరూ పల్లెలో చెరువు గట్టున అలా నడచుకొని పోతుండేవాళ్ళట. ఆ రోజుల్లో తను గీసిన ఆ బొమ్మను నాన్న ఫొటో తీసి పెట్టుకున్నాడు..."

"ఇది మీ దగ్గరికి ఎలా వచ్చింది?" అడిగింది అమ్మ.

"కంగారు పడకండి- వారం క్రితం మీ వారికి యాక్సిడెంట్ అయ్యింది. స్పృహలో లేకుండా ఉన్నారు ఇన్నాళ్ళూ. ఇప్పుడు ఆయన బాగానే ఉన్నారు. తెలివి వచ్చింది. మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు" అన్నాడాయన.

అమ్మ కంగారు పడింది. ఏడుపొచ్చింది.

"అవునా? ఏ హాస్పిటల్‌లో చేర్చారు?" అడిగింది హడావిడిగా.

"కంగారేమీ లేదక్కా, మావెంట రండి! మేం నిన్ను తీసుకొని వెళ్ళేందుకే వచ్చాం. ఇంతకీ నువ్వు నన్ను గుర్తుపట్టినట్లు లేదు-" అన్నాడు అతను. అతని పెదిమల మీద చిరునవ్వు.

అమ్మకి ఆయనెవరో నిజంగానే తెలీదు.

"నువ్వు, అమ్మ, అవ్వ మన గాడిదను వెంటబెట్టుకొని వలస పోయారు చూడు; ఆ సమయంలో చెరువులో మునిగిపోయిన గణేశును నేను! నన్నొక డాక్టరు గారు కాపాడారు; చదివించి డాక్టరును చేశారు. ఇన్నేళ్ళుగా నేను మీకోసం వెతకని చోటు లేదు. ఇప్పటికి, ఈ బొమ్మ పుణ్యమా అని, నావాళ్ళు నాకు దొరికారు" అన్నాడాయన.

'చిన్నప్పుడు చెరువులో మునిగిపోయిన మా గణేశు మామయ్యే ఆయన' అని తెలిసి నేనెంత ఆశ్చర్యపోయానో చెప్పలేను!

నవ్వు!

మెడమీద తల!

మౌనిక: నీ ముఖాన్ని ఇంకెక్కడో చూసినట్టుందే?

సంధ్య: అది అసాధ్యం! నా ముఖం ఎప్పుడూ నా మెడ మీదే ఉంటుంది!

ఆదివారం సెలవు!

తండ్రి:ఏమ్మా! ఇందాక బజార్లో మాస్టారు కనిపిస్తే నమస్కారం పెట్టలేదట?

కావ్య: ఓ అదా, ఇవాళ ఆదివారం కదా, అందుకని!

బొమ్మకు కథ రాయండి!

నిర్వహణ: శ్రీమతి జి.లలిత, telugu4kids.com

గాడిద బొమ్మకు వచ్చిన స్పందనలు చదివారుగా.? ఇప్పుడు ఇక ఈ బొమ్మను చూడండి.. ఎంత అందమైన దుకాణం!



వెదురు బుట్టలు, పేము కుర్చీలు అమ్మే ఈ దుకాణంలోకి పట్నం నుండి ఎవరో వచ్చారు..ఏం కొనుక్కుంటారో, ఎన్ని డబ్బులు ఇస్తారో, దాంతో మరి దుకాణం వాళ్ళు ఎంత బాగుపడతారో..

మీకు తెలుసా, ఆ కథ? తెలిస్తే మాకు రాసి పంపండి. బాగున్న కథని రెండు నెలల తర్వాత కొత్తపల్లిలో ప్రచురిస్తాం. కొత్తపల్లి పత్రిక కాపీ నొకదాన్ని మీకూ అందిస్తాం!

మీ కథలు పంపాల్సిన చిరునామా:

కొత్తపల్లి బృందం, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా-515101



ఒక పిల్లి స్వాగతం

రచన: డా.ఉమాశంకరి, సునీత, వెంకట్రామాపురం, చిత్తూరు జిల్లా.

నేను తెల్లవారి లేచాను. ఒళ్ళు విరుచుకున్నాను. సునీతక్క కూడా లేచి పక్క సర్దింది. మంగవ్వ ఎక్కడ? టీ పెట్టుకుంటా ఉంది. 'మ్యావ్' అంటూ ఆమె దగ్గరికి వెళ్లి, ఆమెని చుట్టి, కాళ్ళ మధ్యలో దూరి, ఆమె చీరమీద రాసుకుంటూ ఉన్నాను. మంగవ్వ అంటే నాకు చాలా ఇష్టం. ఇలా తొందర చేయకపోతే బువ్వ పెట్టదు- "కొంచెం ప్రశాంతంగా టీ తాగనియ్యవే" అంది అవ్వ.

'ఓకే.ఓకే. నేను వెయిట్ చేస్తానులే'

నా పేరు డెయిసీ. నా అసలు పేరు నల్ల పిల్లి. అసలు ఏం జరిగిందంటే మంగవ్వ మనవడు డబ్బిగాడు పోయినసారి వచ్చినప్పుడు నా పేరు మార్చి డెయిసీ అని పెట్టాడు. 'పోనీలే, ఈ పేరు కూడా బాగానే ఉంది' అని అనుకున్నాను. అదిగో మంగవ్వ అన్నం

తెస్తోంది . ఈరోజు మజ్జిగన్నం తెస్తోందే! నిన్న పాలన్నం పెట్టింది. అది నాకు చాలా ఇష్టం. మజ్జిగన్నం కూడా పర్వాలేదులే, కడుపు నిండితే చాలు. నేను ఇప్పుడు ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి రెడీ.

'మ్యావ్- థాంక్యూ అవ్వా, సీ యు !'

నేను పైకి వెళ్లి మచ్చులో ఎలుకల కోసం వెతికాను. 'నిన్న ఇక్కడే ఒక ఎలుకను చూశానే, ఎక్కడికెళ్ళిందబ్బా?' అనుకుంటూ ఇల్లంతా వెతికాను. కనపడలా.

ఒక్కొక్కసారి నాకు ఈ దాగుడుమూత ఆటలంటే విసుగేస్తుంది. కాని ఎలుక కనపడిందంటే దాన్ని పట్టుకునేవరకు అదే ధ్యాస.

అందుకోసమే మంగవ్వ మెడిటేషన్ చేస్తుంది. ఆశలు, పట్టులు వదలుకోవాలని.

కానీ ఆమె మెడిటేషన్ చేసేటప్పుడు నేను ఆ రూముకు వెళితే మాత్రం ఆమె నన్ను తరిమేస్తుంది- ఇక నేను ఎప్పుడు, మెడిటేషన్ నేర్చుకునేది?

కిందకు వచ్చి మెట్ల దగ్గర వెతికాను.

'నో లక్. సరే, ఇక్కడే వేచి ఉంటా, తవుడు డబ్బాలోనే దాక్కొని ఉండొచ్చు అది'

ఓరి దేవుడా! బ్లాకీ నా వైపే చూస్తున్నది. నన్ను చూస్తే 'కాదు' దానికి. పరిగెత్తి నన్ను భయ పెట్టేస్తుంది. 'కొంచెం జాగ్రత్తగా ఉండాలి'.

నేను దాక్కున్నాను.

సరేలే గానీ బ్లాకీ ఎవరు అనుకుంటున్నారు? మా మంగవ్వ వాళ్ళు నేను ఇక్కడకు రాకముందునుండే బ్లాకీని పెంచుకుంటు-న్నారు. దానికి నేనంటే కొంచెం కుళ్లు- నేను వచ్చాక ఇప్పుడందరూ దానిని సరిగ్గా చూసుకోవడం లేదని. అది నా ప్లేటు దగ్గరికి వెళ్లి నేను మిగిల్చిన వన్నీ తింటా ఉంటుంది.

'అబ్బ! ఐ యామ్ బోర్డ్.. '

బోరు కొడుతా ఉంది. 'ఎంత సేపు, ఎలుక కోసం వెయిట్ చేసేది? కొంచెం సేపు చెట్టులెక్కుతాను'.

చెట్టు పైన కూర్చున్నానో లేదో ఒక నల్ల గండు చీమ వచ్చి కుట్టింది. నా పాదంతో ఒకటి

వేశాను. కాని అది విదుల్చుకొని వెళ్ళిపోయింది. చెట్టు పైనుండి చాలా దూరం కనిపిస్తుంది.



అయ్యయ్యో! గాజులవాడు వస్తున్నాడు. చాలా డేంజరస్ ఫెలో. గాజులు అమ్ముతూ 'ఎక్కడెక్కడ పిల్లులున్నాయి' అని గమనించుకుంటాడు వాడు. మళ్ళీ రాత్రికి వచ్చి పట్టుకొని వెళ్తాడంట. ఎందుకైనా మంచిది- నేను దాక్కుంటాను-

“అమ్మా, గాజులు కావాలా?” మా ఇంటికొచ్చి సునీతక్కని అడిగాడు వాడు.

సునీతక్క ముఖం వెలిగింది. గాజులు కొన్ని కొనుక్కుంది సునీతక్క. ఎందుకంట, ఈ ఆడవాళ్ళు ఊరికే అనవసర ఖర్చు పెట్టుకుంటారు? ఇలాంటి డేంజరస్ ఫెలోస్‌ని లోపలికి రానిస్తారు?

"అమ్మా! మీ ఇంట్లో పిల్లులున్నాయా ?" అడిగాడు వాడు, మంగవ్వని చూస్తూ.

“ఇక్కడ పిల్లుల్లేవ్ ,గిల్లుల్లేవ్- వెళ్ళవయ్యా!" అంది అవ్వ. వాడు వెళ్ళిపోయాడు.

'అమ్మయ్య! నన్ను కాపాడింది.. థాంక్స్ అవ్వా!' -నేను ఆమె దగ్గరకు పోయి ప్రేమతో తడిమాను.

మధ్యాహ్నం భోజనాలు అయ్యాక సునీతక్క, శ్రీను బావ టీవీ చూస్తున్నారు. మంగవ్వ మెడిటేషన్ చేస్తోంది.

టీవి కింద భాగంలో పురుగులు, పూచిలు పాకుతున్నై.

నేను టీవీ దగ్గర పోయి, నా పాదంతో తట్టాను వాటిని. సునీతక్క, శ్రీను బావ పకపకా నవ్వారు- “ఏయ్, నల్లపిల్లీ! అవి పురుగులు కావు- అవి స్కోర్ల్స్! " అన్నారు.

'స్క్రోల్సా..?! ఎనివే- సారీ ఫర్ ద డిస్టర్బెన్స్'

చూసేదానికి అందంగా పురుగులు డాన్స్ చేస్తున్నట్టున్న ఆ స్క్రోల్స్ని కాసేపు, టీవీని కాసేపు చూస్తూ ఉంటే శ్రీను బావ నన్ను ఫోటో తీశాడు.

'ఫోటో సర్లే గాని, నా డిన్నర్ ఎప్పుడు రెడీ చేస్తారు వీళ్ళు?' అనుకుంటూ బయటకు వచ్చా.

నాకు చాలా పని ఉంది- టి.వి చూస్తుంటే ఎలా కుదురుతుంది? ఎలుకల్నీ, ఉడతల్నీ, బల్లుల్నీ వెంటాడాలి..

హేయ్! పక్క వూరి పిల్లిగాడు వచ్చి నా వైపు అదోలా చూస్తున్నాడు. చూసే దానికి బాగానే ఉన్నాడు కానీ, నాకు వాడంటే కొంచెం భయం. నేను లోపలకు వచ్చేశాను.

'ఓ! డిన్నర్ రెడీ'.

ఒక బల్లిని మింగేసి, అర్ధరాత్రి దాటాక నేను లోపలకు వచ్చి సునీతక్క పక్కలో పడుకున్నాను. తను అటూ ఇటూ కదులుతూనే ఉంది- నాకు నిద్ర పట్టలేదు. నేను పొయ్యి దగ్గరకెళ్ళి పడుకొని నిద్ర పోయాను. రాత్రి-పగలు పని చేసాక కాసేపు డిస్టర్బెన్స్ లేకుండా నిద్ర పోవద్దూ? మంగవ్వ దగ్గర పడుకోవచ్చు; కానీ ఆమెకు ఇష్టం ఉండదు. నాకు కూడా ఇష్టం ఉండదు- ఎందుకంటే ఆమె పెద్ద పెద్ద గురకలు పెడుతుంది.

మళ్ళీ తెల్లవారి లేచి 'నేనెప్పుడు గురక పెట్టానూ!' అంటుంది సాగదీస్తూ.

'ఇట్స్ ఓకె. నో ప్రాబ్లెం అవ్వా!'

'ఏమి, నీ కథలో క్లైమాక్స్ , డ్రామా, ఫైటింగ్ ఏమీ లేవు ' అనుకుంటున్నారా? మేము మనుష్యులం కాము, మేము మార్జాలాలం. అవి అన్నీ కావాల్సింది మనుష్యులకే. మాకెందుకు? మేం కాస్త జాగ్రత్తగా, తెలివిగా ఉంటే చాలు- బ్రతుకుతాం.

చూస్తూ ఉండండి. కొన్ని రోజుల్లో బ్లాకీ కూడా నాకు దోస్తయిపోతాడు. రేపు సునీతక్క వాడిని నిమిరేటప్పుడు వాడు మంచి మూడ్‌లో ఉంటాడు గదా? నేను అప్పుడు పక్కకి వెళ్ళి మెల్లగా 'మ్యావ్' అంటా. ప్రేమ

మత్తులో ఉన్న బ్లాకీ నన్ను ఏమి చేయదు. "వావ్! గుడ్ ఐడియా! ' కొన్ని రోజుల్లో మేమిద్దరం ఒకే కంచంలో తింటాం. చూస్తూ ఉండండి. ఏమనుకున్నారు మరి నేనంటే? ఐడియాలు, సర్దుకుని పోవడాలు ఉండాలమ్మా, ఏ పని చేయాలన్నా జీవితంలో! 'బై! సీ యు అగైన్!'

భారతం!

నా భారతం- చరిత్రలో గొప్పది

నా భారతం- రాజ భవనాలను ధరించింది

నా భారతం- అడవులక తల్లైయింది

నా భారతం - రాక్షసులకు సంహరించింది

నా భారతం- గంగానదిని రప్పించింది

మన భారతం- భువిలో ప్రసిద్ధి చెందింది

మన భారతం ఎంతో గొప్పది.

రచన: జయంత్,7వతరగతి, రిషివ్యాలీ స్కూల్, మదనపల్లి.

అందమైన ప్రకృతి ఒడిలో

చల్లనైన చదువుల తల్లితో

ఆడుతూ పాడుతూ హాయిగా

ఆనందంగా చదువులు నేర్చేస్తాం.

కొండలెక్కుతాం, మేం గుట్టలెక్కుతాం

చెట్లు పెంచుతాం, మేం చెట్లెక్కుతాం


పక్షులతో గొంతెత్తి పాడుతాం మేం

జంతువులతో ప్రేమగా ఆడుతాం

చెట్లెక్కి గుట్టలెక్కి వాగువంకలన్నీ

తిరిగి ఆనందంగా గడిపేస్తాం.

రచన: సి.కృష్ణవేణి, 8వతరగతి, ప్రకృతిబడి.



మ్యాజిక్ కథ

మంత్రపు నీళ్ళ విజ్ఞానం

రచన: శ్రీ యస్. శంకర శివరావు, ఇంద్రజాలికులు/ఉపాధ్యాయులు, యంపియుపియస్, భద్రాపురం, కనగానపల్లి మండలం, అనంతపురం జిల్లా.



పడమటి కొండ అంచున బంజారాల తండా ఉంది. ముప్ఫై గుడిసెలు- చిన్నాపెద్దా కలసి ఓ రెండు వందల జనాభా. ఎర్ర బస్సు మొగమే ఎరుగదు వాళ్ళ ఊరు. మండల కేంద్రానికి పోవాలంటే ఈ మధ్యనే 'పేంక్లు' అప్పు చేసి తెచ్చిన అప్పీ ఆటోనే గతి.

శ్రీశైలం గిరిజన ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదవతరగతి చదువుతున్నాడు, "భీక్యా" కొడుకు "డౌసు". దసరా సెలవులకని తండాకు వచ్చాడు.

తండాలో అడుగు పెట్టగానే చిన్నపిల్లల కేరింతలు, పెద్దవాళ్ళ హడావిడి కనిపిస్తాయని

ఆశపడ్డాడు డౌను. కానీ ఎక్కడా పిల్లలు కనబడలేదు. పెద్దలు మాత్రం కొందరు అక్కడక్కడా అరుగుల మీద, నీరసంగా కూర్చుని ఉన్నారు. నవ్వులు లేవు; మామూలుగా ఉండే పలకరింపులూ లేవు!

డౌను ఇంటికి వెళ్ళే దారిలో చాలా మంది మంచాల మీద మూలుగుతూ పడుకుని ఉన్నారు. "ప్రొద్దునపూట ఈ పడుకోవటం ఏందబ్బా?" అనుకుంటూ వాడు ఇల్లు చేరేసరికి ఇంటి ముందు మంచం వేసి ఉంది- దాని మీద వాళ్ళ నాన్న పడుకుని ఉన్నాడు!

డౌను నేరుగా ఇంట్లోకి వెళ్ళి వాళ్ళ అమ్మ-చెల్లిల కోసం చూశాడు. ఇద్దరూ ఎక్కడికో వెళ్ళినట్లున్నారు- "నాన్నా, అమ్మా చెల్లి కనపడరేం?" అని అడిగాడు. "ఇప్పుడే మాంగ్యా దగ్గరికి వెళ్ళారురా, నీళ్ళను మంత్రించుకు రావడానికి" అన్నాడు భీక్యా దగ్గుతూ. "ఏంది నాన్నా! సెల్‌ఫోన్‌లు వచ్చినా మీరు మాత్రం మారరా?" అన్నాడు డౌను కోపంగా. భీక్యా గొణిగాడు-"నా చిన్నప్పటి నుండి వాడిచ్చిన మంత్రపు నీళ్ళేరా తండాను కాపాడింది" అని. "ఊఁ! కాపాడుతున్నె కాపాడుతున్నె! అవి అట్లా ఎందుకుంటాయో తెలిస్తే నువ్వు ఈ మాట అనవు!" అన్నాడు డౌను మరింత కచ్చగా.

వర్షాకాలం గదా, తండాలో గుంతలు నిండాయి; మురుగునీరు ఎక్కువయింది. దాంతో దోమలు, ఈగలు వృద్ధి చెందినాయి; తండాలో వాంతులు, బేదులు (విరేచనాలు) ఎక్కువగా అవుతున్నాయి. "నాకు జాతర చేయలేదు- ఎందుకు? నాకు కోపం వచ్చింది. అందరికీ రోగాలు వచ్చేట్లు చేసాను!" అని మారెమ్మ పూనకంలో ఊగిపోతూ చెప్పాడు మంగ్యా. ఇంకేముంది, తండా వాళ్ళు వెంటనే మారెమ్మకు జంతు బలులు ఇచ్చి పెద్దజాతర చేసేసారు. దాంతో పరిశుభ్రత మరింత లోపించింది! జల కాలుష్యానికి ఆహారకాలుష్యం తోడైంది. ఇంకా ఎక్కువ మంది మంచాన పడ్డారు.

ఇన్నేళ్ళుగా తండాలో వాళ్ళందరికీ దిక్కు మంగ్యా ఒక్కడే. దోష నివారణకు మంత్రాలు, యంత్రాలు కట్టి; పూజలు చేసి బాగు చేస్తాడని

తండా వాసులంతా ఏ రోగం వచ్చినా అతని దగ్గరికే వెళ్ళేవాళ్ళు; మంగ్యాకు భారీగా ముడుపులు, పాలు, పెరుగు ఇచ్చేవారు. వాటన్నిటితోటీ మంగ్యాకు వేరే పనంటూ ఏదీ లేకుండా పోయింది. కష్టమంటూ ఎరగక అతను హాయిగా జీవిస్తుంటే, జనాలు మాత్రం రోగాలతో బాధపడేవాళ్ళు.

అతని వైద్యం వింతగా ఉండేది. అందరికీ నీళ్ళను మంత్రించి ఇచ్చి తాగమనేవాడు. ఒక్కోసారి అతను మంత్రించి ఇచ్చిన నీళ్ళు చేదుగా ఉండేవి. అప్పుడు చెడు జరుగుతుందని నమ్మకం, ప్రజలకు. ఒక్కోసారి ఆ నీళ్ళు చక్కెర నీళ్ళకంటే తియ్యగా ఉండేవి. అట్లా ఉంటే ఆ రోగాలు నయం అవుతాయని ప్రజలకు నమ్మకం కలిగిపోయేది.

ఈ నీళ్ళ మహాత్యం గురించి డౌను వాళ్ళ సైన్స్ మాష్టారు గోపాల్‌రావుకు చెబితే, ఆయన నవ్వి, "ఓరి, ఆమాత్రం తెలీదా, అది సాకరిన్-క్లోరోక్విన్ మాయాజాలంరా!" అని వివరించి చూపాడు. అది చూశాక డౌనుకైతే సిగ్గే వేసింది- ఇంత చిన్న విషయం తనకు ఎందుకు తట్టలేదు అనిపించింది. ఇప్పుడు తన మంత్రశక్తిని తండా వాసులకు చూపించాల్సిన సమయం దగ్గరపడిందన్నమాట!

వెంటనే డౌను 104 నంబరుకు ఫోన్ చేశాడు. తమ ఊరిలో అతిసార వ్యాధి, విషజ్వరాలు పెచ్చు మీరిన సంగతి తెలియజేసాడు. "తమరు ఈరోజు సాయంత్రానికే ఇక్కడికి రావాలి" అని వాళ్లకు విజ్ఞప్తి చేశాడు.

ఒకవైపునుండి 104 అంబులెన్సు వాహనం వచ్చేసరికి, రెండో వైపున "పట్నం నుండి వచ్చిన భీక్యా కొడుకు డౌనుకు మంత్ర శక్తులు వచ్చాయి" అని తండా అంతటా గుప్పుమన్నది. రోగులందరూ డౌను ఇంటి దగ్గరికి వచ్చి కూర్చుని ఉన్నారు.

అందరిముందూ డౌను నిలబడి, "రెండు గ్లాసుల్లో నీళ్ళు తేండమ్మా" అని చెప్పాడు ఒక పాపకు. ఆ పాప నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

డౌను రెండిటిలోనూ తన చూపుడు వేళ్లను ముంచి తిప్పుతూ "పోరిపాంయ్యద-పోరిపాంరసాతిఅ-పోరిపాంనజ్ఞాఅ" అని

ఏవేవో మంత్రాలు చదివాడు.

అందరూ భయం భయంగా వాడివైపే చూస్తుంటే, వాడు ఒక రోగిని దగ్గరికి పిలిచి, "ఇదిగో, ఈ ఎడమ చేతిలో ఉన్న గ్లాసులో నీళ్ళు త్రాగు ఒక గుక్కెడు!" అన్నాడు. అవి పరమ చేదుగా ఉన్నై! వాడు అయిష్టంగా ముఖం చికిలించగానే "మామా! నీ ఆరోగ్యం ఇంక హుళక్కి!" అన్నాడు డౌను.



ఊళ్ళోవాళ్ళంతా భయభ్రాంతులైపోయారు. "మరిప్పుడు ఏం చెయ్యను?" అన్నాడు ఆ రోగి. "ఏముంది, ఇప్పుడు నా కుడి చేతిలో ఉన్న గ్లాసులోంచి పుక్కెడు నీళ్ళు త్రాగు" అన్నాడు డౌను. వాడు భయం భయంగానే రెండో గ్లాసులో నీళ్ళు తాగి చూశాడు- అవి ఎంత తియ్యగా ఉన్నాయో చెప్పలేం! వాడి ముఖం సంతోషంతోవెలగటం చూసి "ఏం మామా! నీ ఆరోగ్యం ఇంక బాగైపోయినట్లేనా?" అన్నాడు డౌను నవ్వుతూ. వాడు అనుమానంగా తల ఊపగానే డౌను అందరివైపూ తిరిగి "చూడండి! ఇందులో మంత్రం ఏమీ లేదు. బజార్లో సులభంగా దొరికే పొడులు రెండున్నై. ఒకటేమో 'సాకరిన్'- ఈ పొడిని చవకబారు కూల్‌డ్రింకులు, ఐసుక్రీములు అన్నిటిలోనూ కలుపు-తుంటారు. ఇది చక్కెరకంటే తియ్యగా ఉంటుంది. ఇక రెండోది 'క్లోరోక్విన్'- ఇది మలేరియా మాత్రల రూపంలో ప్రతి మందుల దుకాణంలోనూ దొరుకుతుంది. ఇది గడ్డు చేదు-

నేను ఏం చేసానంటే, నా ఎడమ చేతి వేలుకి క్లోరోక్విన్ పొడిని రుద్దుకున్నాను. కుడి చేతి వేలుకి సాకరిన్ అద్దుకున్నాను. ఆ పాప నీళ్ళు తెచ్చి ఇవ్వగానే గ్లాసుల్లో వేళ్లను అద్ది "దయ్యం పారిపో- అతిసారం పారిపో- అజ్ఞానం పారిపో"

అని మంత్రాలు చదివాను- తిరగదిప్పి! ఇంకేముంది, నా వేళ్ల వల్ల నీళ్లకు ఆ రుచులు అంటాయి! ఇప్పుడు అర్థమైందా, మంగ్యా చేతి వేళ్ళ మహిమ, మంత్రపు నీళ్ల విజ్ఞానం?!" అని ఆ పొడుల పొట్లాలను రెండింటినీ బయటికి తీసి చూపించాడు.

ఊళ్ళోవాళ్లంతా ముందుకు వచ్చి కొంచెం కొంచెంగా రెండిటినీ రుచి చూశారు- "ఔనురా, ఒరే! ఇన్నాళ్ళుగా మాకు అర్థమే కాలేదు- మంగ్యా చేతిలో ఏ మాయలూ లేవన్నమాట!" అన్నారందరూ.

"అవును, నిజం పెద్దయ్యా! పరిశుభ్రత లోపం వల్ల అతిసారం, గ్రహణి, విషజ్వరాలు- ఇవన్నీ వస్తుంటాయి. వీటికి మూఢనమ్మకాల మందులు చాలవు- శాస్త్రీయంగా చదువుకున్న వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడాలి; ఊళ్ళో పారిశుధ్యం బాగుండేట్లు చూసుకోవాలి. మేం అందుకే వచ్చాం; డౌను పిలిచాడు మమ్మల్ని. ఇప్పుడు ఒక్కరొక్కరుగా రండి; మీ సమస్యలకు మందులు ఇస్తాం" అన్నారు 104 వాహనంలో వచ్చిన డాక్టరుగారు.

రోగులందరూ వరసగా నిలబడి ధైర్యంగా మందులు తీసుకున్నారు. అందరూ శ్రద్ధగా మందులు వాడారు. ఒక్క వారం రోజుల్లో అందరి ఆరోగ్యాలూ ఒక దారికి వచ్చేసాయి. అంతలో మంత్రిగారు, జిల్లా కలెక్టర్ కూడా తండాను సందర్శించారు. "రక్షిత మంచి నీటి పథకం ద్వారా మంచి నీళ్ళు ఇస్తాం- రోడ్లు వేయించి, ఇళ్ళుకట్టించి తండాని అభివృద్ధి పరుస్తాం- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రావు- మంత్ర తంత్రాల్ని నమ్మొద్దు" అని చెప్పారు.

మంచి పని చేసిన డౌనును కలెక్టరు మెచ్చి, వెయ్యి రూపాయల నగదు బహుమతి ఇచ్చారు.

అటుపైన తండా వాళ్ళు మంగ్యా దగ్గరికి వెళ్ళటం పూర్తిగా మానేసారు. తమ రోగాలకు డాక్టర్లను సంప్రతించసాగారు. మంగ్యా పొలంపని చేసుకొని గౌరవంగా జీవించటం మొదలు పెట్టాడు. ఊరికి మేలు చేసిన డౌను పైచదువుల కోసం పట్నం వెళ్ళాడు.



భయం - భక్తి

మనకి భక్తి ఎక్కువా, భయం ఎక్కువా? భయానికి, భక్తికీ పోటీ పెడితే చాలా సార్లు భయమే గెలుస్తుంది. ఈ విషయాన్ని అద్భుతంగా వ్యక్తం చేస్తున్నది ఈ కథ .. చదవండి.. మన బలహీనతల్ని తలచుకొని ఓమాటు నవ్వండి.

కథనం: నారాయణ, కొత్తపల్లిబృందం.

చాలా సంవత్సరాల క్రితం బోధిసత్త్వుడు కాశీరాజ కుమారుడిగా జన్మించాడు. ఆ రోజుల్లో ఆచారాలు, మతపరమైన తంతులు జన జీవితంలో ప్రధానపాత్ర పోషిస్తూ ఉండేవి. ప్రతి చిన్న విషయానికీ జంతువుల్ని బలి ఇవ్వటం, యజ్ఞాలనీ యాగాలనీ విలువైన వస్తువులని నిప్పులో వేసేయటం చేస్తూ ఉండేవాళ్లు అందరూ.

అందరిలాగానే కాశీరాజు గారు కూడా అనేక తంతుల్లో ఎప్పుడూ మునిగితేలుతూ ఉండేవాడు. రాజకుమారుడికి మాత్రం ఇదంతా చాలా అనవసరం అనిపించేది. కారణాలు, ఫలితాలు ఎలా ఉన్నా, అన్ని

'మూగ ప్రాణులను బలి పెట్టటం' అన్న ఆలోచనే అతనికి అమానుషం అని తోచేది.

తండ్రిగారు అలాంటి తంతులు చేపట్టినప్పుడల్లా రాజకుమారుడు వెళ్లి ఒక మర్రి చెట్టు క్రింద కూర్చొని ధ్యానం చేసుకునేవాడు. కొడుకు ప్రవర్తనని చూసి రాజుగారు ఏమనుకున్నారో తెలీదు కానీ, మొత్తం మీద "ఇంకా పసివాడులే" అని వదిలేసి ఉండచ్చు.

అయితే క్రమంగా రాజుగారు ముసలివాడయ్యాడు. రాకుమారుడూ యువకుడయ్యాడు, రాజకుమారుడి పట్టాభిషేక సమయం దగ్గరపడింది. ఆ సమయంలోనే కాదు; అటుపైన రాజుగా కూడా ఆ దేశపు ఆచార వ్యవహారాలన్నిటినీ సంరక్షించాల్సిన బాధ్యత అతని మీద పడనున్నది - అంటే అప్పటి వరకు తండ్రిగారు చేసిన తంతులన్నీ ఇప్పుడు ఇతను చేయాలి! ఎలాగ!?

కొత్తగా సింహాసనాన్ని అధిరోహించిన సమయంలో యువరాజు భయంకరమైన ప్రకటన ఒకటి చేశాడు. అది విని రాజ్యం యావత్తూ హోరెత్తిపోయింది.



అదేమంటే- "ప్రజలారా! ఇన్నేళ్లుగా నేను మర్రి చెట్టు దేవతను కొలుస్తున్న సంగతి మీకందరికీ తెలుసు, ఆ దేవత మామూలు దేవత కాదు. ఇప్పుడు , నేను రాజపదవిని స్వీకరించిన తరుణంలో, ఆ దేవికి నివేదనగా వెయ్యిమంది మనుష్యులను బలి ఇస్తానని మొక్కుకున్నాను!! -అయితే బలికి కావలసిన ఆ వెయ్యి మందీ వాళ్ల వాళ్ల దేవతలకు జంతు బలులిస్తూ ప్రీతి కలిగిస్తూన్నవాళ్ళే అవ్వాలి- అంటే, ఏ దేవత

పేరునైనా సరే, జంతువుల్ని ఇష్టపూర్వకంగా బలి ఇస్తున్న వెయ్యిమంది మనుషుల్ని పట్టుకొని, నేను మా దేవికి బలి ఇవ్వాల్సి ఉన్నది! ఆ పని కోసం ప్రత్యేకంగా కొంత సైన్యాన్ని నియోగించనున్నాను కూడా!" అని.

అటుపైన కాశీ రాజ్యంలో ఒక్కరు కూడా జంతువుల్ని బలి ఇవ్వలేదు.

ఒక్క మనిషినీ బలి ఇవ్వకుండానే బోధిసత్త్వుడి జీవితం గడచిపోయింది. అటు రాజ్యంలో జంతువుల్నీ బ్రతికి పోయాయి!!

చిరంజీవి మహిమ!

నవ్వు!

సాయి: మా ఇంటికి రాత్రి ఒక దొంగ వచ్చాడు!

వేణు: మరి నువ్వు ఏం చేసావు?

సాయి: "దొంగ, దొంగ" అని గట్టిగా అరిచాను- కానీ ఎవ్వరూ రాలేదు.

వేణు: మరి, అప్పుడు ఏమి చేసావు?

సాయి: "చిరంజీవి, చిరంజీవి!" అని గట్టిగా అరిచాను- అంతే, అందరూ బయటకు వచ్చారు. దొంగ దొరికిపోయాడు!

బరువేమయిందో?!

బిచ్చగాడు: అమ్మా! ఒక రూపాయి దానం చెయ్యండమ్మా, అన్నం తిని నాలుగు రోజులు అవుతోంది!

అమ్మ: ఒక రూపాయితో అన్నం ఎలా తినగలవు?

బిచ్చగాడు: కాదమ్మా! ఎంత బరువు తగ్గానో చూసుకుందామని అడిగాను!

చిలిపి ప్రశ్నలు-తిక్క జవాబులు

రచన: శ్రీ వి.వి.యస్.మూర్తి, చొదిమెళ్ళ, పశ్చిమగోదావరి జిల్లా.

1.వందనోటు కంటె రూపాయి బిళ్ళ ఎందుకు గొప్పది?

జవాబు:రూపాయి బిళ్లతో ఐతే ఫోన్ చేసుకోవచ్చు!

2.ఫోటోగ్రాఫరుకి అసాధ్యమైనదేది?

జవాబు:'చీకటి'ని ఫోటో తియ్యటం!

3.లెక్కల మేస్టారికి, దేవుడికి పోలిక ఏమిటి?

జవాబు:మనం ఒక సమస్యపూర్తి చేయగానే ఇంకొకటి ఇస్తుంటారు ఇద్దరూ!

4.ఎటువంటి పరిస్థితులలోనైనా బ్రతకగల మొక్క ఏది?

జవాబు: కలుపు మొక్క.

5.లెక్కల మోస్టారి ఇంటినంబరు?

జవాబు:1/2 - 3/4 + 5/9 x 7%8 - 9.

6.భీమా ఏజంట్ పెళ్ళికొడులయితే?


జవాబు:కట్నం కింద కోటిరూపాయిలు పాలసీ తీసుకోమంటాడు.

7.వెజిటేరియన్ యానిమల్స్ అంటే?

జవాబు:శాకాహారులుగా జీవిస్తూ మాంసాహారానికి ఉపయోగపడే జంతువులు.

8. అతి గొప్ప చెప్పుల ప్రకటన?

జవాబు:"కుడి కాలు చెప్పు కొంటే ఎడమకాలి చెప్పు ఫ్రీ"!



యోకేశ్వరన్

యువకెరటాలు

నిర్వహణ: సౌమ్య, పుస్తకం.నెట్.

ఇన్నాళ్ళూ వివిధ దేశాల పిల్లల్ని గురించి చెబుతూ వచ్చాను కదా, చాలాసార్లు అనిపించేది నాకు- వీళ్ళంతా వీళ్ళ దేశాల్లో కాబట్టి ఇలా చెయ్యగలిగారు కానీ- మన దేశంలో ఇవన్నీ వీలు కావేమో, మన పరిస్థితుల్లో ఇలాంటివి చేయడం అంత తేలిక కాదేమో అనిపించేది. కానీ, ఈసారి పరిచయం చేయబోతున్న అబ్బాయి మనవాడే. పదమూడేళ్ళ తమిళ అబ్బాయి.

యోకేశ్వరన్ తమిళనాడులోని కాంచీపురం పట్టణంలో ఒక ప్రభుత్వ స్కూలులో ఏడవ తరగతి విద్యార్థి. ఏటా మన దేశంలో జరిగే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఎంతో మంది పిల్లలు సైన్సు పరిజ్ఞానంతో తయారు చేసిన వస్తువులని ప్రదర్శిస్తూ ఉంటారు; తమ పరిశోధనల ఫలితాలను వెల్లడి చేస్తుంటారు. మరి యోకేశ్వరన్ రైతు బిడ్డ- అందుకని, రైతులకు పనికొచ్చే అంశం "గండుచీమలు, చెదలు భూసారాన్ని పరిరక్షించడానికి ఎలా తోడ్పడతాయి?" అని పరిశోధన చేసాడు. "అవి మట్టికి, రైతుకు స్నేహితులు" అని కనిపెట్టాడు. తన పరిశోధన ఫలితాలను ప్రదర్శించి ఇండియన్ సైన్సు కాంగ్రెస్‌లో మొదటి బహుమతి

సాధించాడు.

కాంచీపురం పట్టణంలో హ్యుండాయ్ సంస్థ వాళ్ళు వ్యవసాయ భూములు కొని, అక్కడ పరిశ్రమలు నెలకొల్పారు. దీనివల్ల, ఆ చుట్టుపక్కల వ్యవసాయ భూముల్లో అంతటా మట్టి సారం కోల్పోయింది. అక్కడి పంటలు అన్నీ దెబ్బ తిన్నాయి. ఈ నేపథ్యంలో యోకేశ్వరన్, అతని టీచర్ శక్తివేల్ కలిసి, 'మట్టి నాణ్యతను సేంద్రియ మార్గాల్లో పెంచడం ఎలాగ?' అని రైతులతో వివరంగా చర్చించారు. అటుపైన ఒక చిన్న ప్రయోగం చేసారు. అదేమిటంటే, ఒక చిన్న పంటభూమిని తీసుకుని, అందులో చీమల్ని ఆకర్షించే చెరుకు పంటని వేసారు. అలాగే, ఇంకో భూభాగంలో బఠానీ మొక్కలు నాటారు. వీటి దగ్గరికి చెదల్ని తీసుకొచ్చారు. ఎలాగ? జీవం ఉండే చెట్ల వంటి వాటిని చెదలు ఇష్టపడవు కదా! అందుకని వీళ్ళు ఏం చేశారంటే, చెక్క పొట్టు, రంపపు పొడి, ఇట్లాంటివి సేకరించారు. వాటిపైన నీళ్ళు చల్లారు. దాన్ని ఈ భూభాగంలో ఉంచేసరికి, ఒక్క రోజు తిరగకుండా చెదలతో నిండిపోయింది అది. ఇంక ఇంకో భాగంలో ఇలా చీమలు, చెదలు ఏవీ రాకుండా మామూలుగా ఉంచేశారు.

కొన్నాళ్ళ తరువాత, ఈ భూభాగాల లోని మట్టిని వ్యవసాయ పరిశోధనశాలకి తీసుకెళ్ళి చూస్తే: చీమలు, చెదలు ఉన్న భూమి- ఇవేవీ లేని భూమితో పోలిస్తే బలంగానూ, సారవంతం గానూ ఉందని స్పష్టంగా తెలిసి పోయింది. అలాగే, చీమలు, చెదలు నిండిన భూమిలో ఏ మొక్కలైతే పెరిగాయో, అవి ఇవేవీ లేని భూమిలో ఉన్న మొక్కల కంటే పొడుగ్గా కూడా ఉన్నాయంట! అలా "చీమలు, చెదలు మట్టికి నేస్తాలు- భూసారాన్ని పెంచేందుకు అవి తోడ్పడతాయి" అని తీర్మానించగల్గారు వాళ్ళు.

అతి సాధారణంగాను , తేలిగ్గాను అనిపించే ఈ ప్రయోగం రైతులకి ఎంత ఉపయోగమో కదా! దాంతో పాటు 'చెదలు, చీమలు మన పంటలకు శత్రువులు కాదు; అవి మన మిత్రులు' అని అర్థమౌతుంది!

ఇలా పరిసరాల్ని శ్రద్ధగా గమనిస్తూ ఉంటే, మనకి కూడా ఎన్నో ప్రయోగాలు చేసే అవకాశం ఉంటుంది. వీటిల్లో ఏదో ఒకటి నిజంగా అందరికీ ఉపయోగపడేది కావొచ్చు చివరకి... అందరం కంప్యూటర్ల తోనూ, రసాయనాలతోనూ, కంపెనీలలోనూ మాత్రమే ప్రయోగాలు చేయాలనేం ఉంది?!

పదరంగం-15

ఈ పదరంగం చాలా సులభం! దీన్ని ఓ పోస్టు కార్డులో పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-15 తో పాటు ప్రచురించగలం. నిర్వహణ: దేవి, బెంగుళూరు.

	1	2		3	
4			5		
					6
7		8		9	
		10	11		
12			13		

ఆధారాలు:

అడ్డం:

1. ప్రపంచంలో ఎక్కువ జనాభా గల దేశం(2)

3. ప్రపంచం, జగతి(2)

4. బొమ్మలు గీసే కళ(5)

7. కోయిల కూసే ఋతువు - పూలు పూచే ఋతువు(3)

9. నక్షత్రం (2)

10. విషం (3)

12. అర్ధ భాగం (2)

13. అన్నీ, సమస్తం (3)

నిలువు:

1. మొదటి మాసం (4)

2. 'నాకు లేదా?' - మొదటి అక్షరాలు (2)

3. 'ప్రభంజనం'లో చాలా మంది మనుషులు(2)

5. కత్తి(2)

6. చెరసాల - పొట్టిగా(2)

7. చెట్ల వరుసలోను, చీమల వరుసలోను ఉన్నది (3)

8. గతం తిరగబడింది (2)

9. చివర జరిగిన తాళం కప్ప (3)

11. సున్న లేని రసం(2)

పదరంగం-14 కి సరైన సమాధానం రాసి పంపిన పిల్లలు:

1. జి.సత్యలక్ష్మి, రెండో తరగతి, ఇంటిబడి, చెన్నేకొత్తపల్లి.
2. ఏ.యస్. నందన, 4 వ తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.
3. తరుణి స్ఫూర్తి, 4 వ తరగతి, గడ్డంనాగేపల్లి, నార్పల.
4. తినాథ్,బోస్, అరవింద హైస్కూలు, విజయవాడ.
5. వి. వినయ్ కుమార్, 5 వ తరగతి, అరవిందస్కూల్.

1 ఎం	డ	2 లు		3 బ	
ద్ర		4 ర	5 స	య	నం
6 కా	రు	మ	బ్బు	7 లు	
య		ఘ		దే	హం
	8 సో	మ	వా	రం	
9 కో	ల	ను		10 డు	ను

చిట్టి పాటలు



సేకరణ, గానం: జి.అంజలి, రెండవ తరగతి, ప్రభుత్వప్రాథమికపాఠశాల, చెన్నేకొత్తపల్లి.

1. అల్లిబిల్లి జాబిల్లి

అల్లిబిల్లి జాబిల్లి

అల్లరి చేసే మా తల్లి

పట్టుచీర కట్టింది

బొట్టు కాటుక పెట్టింది

చేతికి గాజులు తొడిగింది

కాళ్లకు గజ్జెలు కట్టింది

నడుముకు వడ్డాణం పెట్టింది

మెడలో హారం వేసింది




జడలో మల్లెలు తురిమింది

తలకి కిరీటం పెట్టింది

ఎత్తుపీటపై కూర్చుంది

తానే రాణని మురిసింది



2. గుడిలో గంట ఉన్నది

గుడిలో గంట ఉన్నది

హారతికి వేళ అయ్యింది

పూజారి గంట కొట్టాడు

గంట గణ గణ మోగింది

3. అందాల నెమలి

నెమలి నెమలి అందాల నెమలి
నెమలికి నేను గింజలు వేస్తే
నెమలి నాకు ఈక ఇస్తే
ఈకను పోయి ఈశ్వరుని ఇస్తే
ఈశ్వరుడు నాకు ఈత నేర్పే
ఈతలోన పోటీ పెడితే
నాకే మొదటి బహుమతి వచ్చే !





4. జంగుకు శంఖం దొరికింది

జంగు శంఖం ఊదాడు
శంఖం భం భం మోగింది
ఆకాశంలో మబ్బులు కమ్మాయి
నెమిలి పింఛం విప్పింది
పింఛం మిల మిల మెరిసింది

ముద్రిత ప్రతుల వెల: ప్రతి ఒక్కొంటికి: 20 రూ.
12 పుస్తకాలకై చందా: 240 రూ.

“కొత్తపల్లి ట్రస్టు” పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.
బ్యాంకు అకౌంటు వివరాలు:
“Kottapalli Trust”, A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670
ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు
సంపాదకత్వం: నారాయణ
వెబ్సైటు, సాంకేతికత: ఆనంద్, లక్ష్మి
ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు
ముఖచిత్రం 'కొత్తపల్లికి నాలుగేళ్ళు': వీరాంజి
చిత్రాలు: అడవి, రామ్, వినయ్, రాజశేఖర్, లక్ష్మి, వెంకట్, దివ్య, గౌరి, ప్రసాద్.
కథలు, పాటలు: చాలామంది పిల్లలు

ప్రత్యేక కృతజ్ఞతలు: ప్రకృతి బడికి, వికాస విద్యావనం వారికి, రిషివ్యాలీ స్కూలు వారికి, అభ్యాసవిద్యాలయం వారికి, తేజ టాలెంటు స్కూలు వారికి, అరవింద హైస్కూలు వారికి, పెద్దపసుపుల ZP స్కూలు వారికి, గడ్డం నాగేపల్లి పుల్లయ్యగారికి, శంకర శివరావు గారికి, telugu4kidsవారికి, చిలిపిప్రశ్నల మూర్తిగారికి, 'విద్యార్థి' మాలతీకృష్ణగార్లకి, రాధా రాజశేఖర్‌గార్లకి, కంప్యూటర్లలో లైనక్సు వ్యవస్థను చక్కగా అందిస్తున్న ఉబుంటు వారికి, జింప్, అడాసిటీ తదితర ఓపెన్ సోర్సు సాఫ్టువేరు నిర్మాతలకు, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.


పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి-నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలు పెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

మేధ మ్యాజిక్స్

"అమ్మో లెక్కలు! బాబోయ్ " అనుకునే పిల్లలు ఎక్కువైపోతున్నారు ఈ మధ్య. ఆ భయాన్ని ప్రక్కకు నెట్టేసి "ఆహా! ఓహో! లెక్కలు" అనిపించేందుకు కావాలి "మేధమ్యాజిక్కులు". ఈ పద్దెనిమిది రూపాయల చిట్టి పుస్తకంలో లెక్కల గారడీలు ఒక యాభైపైన ఉన్నై. వాటిని ఒక్కొక్కటిగా సాధన చేస్తూ మిత్రుల మీదా, బంధువుల మీదా ప్రయోగిస్తూ, ఎంతటి పిల్లలైనా "వామ్మో పిడుగు!" అనిపించుకునే అవకాశం ఉంది.

"తలనొప్పి దెచ్చు లెక్కల సులభమ్ముగ లేత మనసు సోకెడి రీతిన్ వెలయించితివి వినోదము కలగలిపితి వందులోన ఘనుడవు మూర్తీ!" అని కవిరావు గారు రాశారు, పుస్తకం వెనక.

నిజమే. నేర్పేవాళ్లకు, లెక్కల్ని ఇష్టపడేవాళ్లకూ, లెక్కలు రాని వాళ్లకూ- అందరికీ నచ్చే చిన్నిపుస్తకం ఇది!




"మేధ మ్యాజిక్స్ "

ఎన్ వి ఆర్ సత్యనారాయణ మూర్తి,

విశాలాంధ్ర ప్రచురణ,

పేజీలు: 44, వెల: 18 రూ.



రచయిత గురించి

ఎన్.వి.ఆర్. సత్యనారాయణ మూర్తి, M.A., B.Sc., B.Ed., 25-11-1943న విశాఖపట్నం జిల్లా పెనుగొల్లులో జన్మించారు. వీరు రాసిన కథలు, గేయాలు, వ్యాసాలు 900కు పైగా ప్రసిద్ధ తెలుగు పత్రికలన్నింటిలోనూ ప్రచురింపబడ్డాయి. 1982లో విజయనగరం జిల్లా స్థాయిలోను, 1987లో రాష్ట్ర స్థాయిలోను ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డులు అందుకున్నారు. 1988లో "బాల సాహిత్యానుస్రష్ట" బిరుదును పొందారు.

వీరు రాసిన గణిత విజ్ఞాన కథలను "మాట్లాడే అంకెలు" అనే పేరుతో ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ పుస్తకంగా 1991 నుండి నాలుగు సార్లు ప్రచురించింది.

ఆకాశవాణి విశాఖపట్నం వారు చిన్నపిల్లలకోసం ప్రసారం చేసిన 'చిలక పలుకులు' కార్యక్రమానికి కొన్ని కథలు, పాటలు రాశారు.

ఆంధ్రపత్రిక వారి బాలరంజనిలో 'గామా' అనే కలంపేరుతో 'అంకెల గారడీ' అనే శీర్షికలో అంకెలలో రకరకాల తమాషాలు తెలియజేశారు.

1990లో వెలువడిన 'రెఫరెన్స్ ఆసియా' పుస్తకంలోనూ, 1994లో వెలువడిన 'ఇండో అమెరికన్ హూ ఈజ్ హూ' పుస్తకంలోనూ వీరి బయోగ్రఫికల్ నోట్ చోటు చేసుకుంది.

"విశాఖపట్నం కె.సోమేశ్వరరావు సాహితీ ట్రస్ట్" 10-9-1995న వీరికి ఉత్తమ ఉపాధ్యాయునిగా, బాలల కథారచయితగా అవార్డు ప్రదానం చేశారు.

ఆంధ్రప్రభ దినపత్రిక అనుబంధం చిన్నారిలో వీరు రాసిన 'అంకెల వింతలు' సుమారు 200కు పైగా వెలువడ్డాయి.

విజయనగరం జిల్లాలో గణిత ఉపాధ్యాయునిగా ప్రసిద్ధులైన వీరు బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాల నుండి ప్రధానోపాధ్యాయునిగా 30-11-2001న పదవీ విరమణ చేశారు.

బొబ్బిలి విజ్ఞాన వివర్ధినీ పరిషత్తు ప్రధాన కార్యదర్శిగా, శ్రీకళాభారతి సాహిత్య విభాగ కార్యదర్శిగా పనిచేశారు. బొబ్బిలి విజ్ఞాన వివర్ధినీ పరిషత్ వారు బాలల కథారచయితగా వీరిని 8-2-97న సన్మానించారు.

బాలల కోసం వీరి రచనలు
వివిధ పత్రికలలో ఇంకా ఎన్నో- ఎన్నెన్నో! ...

తెలుగెందుకు రాదు?

రచన: ఆర్.ప్రగతి, 9 వతరగతి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, వెంకటంపల్లి.

"వెంకటంపల్లిలో కృష్ణ అనే తెలుగు ఉపాధ్యాయుడు ఉన్నాడు. ఆ బడిలో పిల్లలంతా ఆంగ్లంలోనే మాట్లాడాలని నియమం. వాళ్ళందరికీ తెలుగులో మటుకు సున్న మార్కులు వస్తుంటాయి- మిగతావాటి సంగతి ఎలాగున్నా. సంవత్సరం ప్రారంభంలో కృష్ణ అయ్యవారు తొమ్మిదో తరగతి గదిలోకి వెళ్తే తెలిసింది- పిల్లలెవ్వరికీ తెలుగు చదవడం రాదు; రాయడం రాదు!

కృష్ణకు చాలా బాధ వేసింది. ఆయన ప్రధానోపాధ్యాయులను కలసి "అయ్యా! మన పాఠశాలలో పిల్లలు తెలుగును పూర్తిగా మరచే పోతున్నారు. ఒక్క మన బళ్ళోనే కాదు; రాష్ట్రమంతగా ఇదే పరిస్థితి. 200 సంవత్సరాలపాటు మనల్ని బానిసలు చేసి పాలించిన వారి భాష కదా, ఇంగ్లీషు?! అది ఈనాడు మనకు అవసరమే, కాదనను- అయినా తమ మాతృభాషను పిల్లలు ఈ విధంగా మర్చిపోవటం న్యాయంకాదు. దీన్ని నేడు మనం సూటిగా ఎదుర్కోకపోతే రేపు అది మరింత పెద్ద సమస్యగా మారుతుంది. అందుకని మనం పిల్లల చేత తెలుగు పుస్తకాలను చదివించాలి. వాళ్ల చేత కథలు, పాటలు రాయించాలి. ప్రతి రోజూ 2, 3 గంటలైనా మన మాతృభాషలో మాట్లాడించాలి. తెలుగు భాషలోని అందాన్ని వారికీ అందించాలి. తెలుగు భాషను మరవకుండా చిరకాలం గుర్తుండేటట్లు చేయాలి" అని కోరాడు.

కానీ అక్కడి వాళ్ళంతా నవ్వారు. "ఏంటయ్యా, నువ్వు ఉత్త పిచ్చివాడి లాగా ఉన్నావు! ఇప్పుడు తెలుగు ఎందుకు ఉపయోగపడుతుంది? విదేశాలలో ఉద్యోగాలు రావాలంటే ఆంగ్లం చదవాలి. అందుకని మనం పిల్లలకు ఎక్కువగా ఆంగ్లమే నేర్పాలి. నీ మాటలు విన్నామంటే పిల్లలందరూ తెలుగు నేర్చేసుకుని, ఇక ఆపైన మన దేశంలోనే వ్యవసాయం చేసుకుంటూ బ్రతకాలి- ఊరుకోవయ్యా!" అన్నారు.

అప్పుడు "అయ్యా! నిజమే, తెలుగు ఒక్కటే చదివితే ఉపయోగంలేదు. ఈ రోజున ఆంగ్లం చాలా ఉపయోగకరం. కానీ మీకు తెలుసో లేదో, మన శాస్త్రజ్ఞులలో 75% మంది వాళ్ళ మాతృభాషలోనే చదువుకున్నవాళ్ళు. ఐఐటీ ప్రొఫెసర్లలో ఎక్కువ మంది మాతృభాషా మాధ్యమం నుండి వచ్చిన వాళ్ళే. అంతెందుకు, రేడియో-టివిల్లో ఆంగ్ల వార్తలు చదివేవాళ్ళలో సగంమంది మాతృభాషలో చదువుకున్నవాళ్ళే. వాళ్ళంతా పనిలో ఆంగ్లాన్ని ఎంత చక్కగా వాడతారో, తమ జీవితాల్లో మాతృభాషల్ని అంతగా ఇష్టపడుతున్నారు. అంతెందుకు, విజ్ఞానశాస్త్రపు విలువలు అధికంగా ఉన్న జపాన్, తైవాన్, చైనా, రష్యా- అన్ని దేశాల్లోనూ ప్రజలు తమ మాతృభాషా మాధ్యమంలోనే అన్ని సంగతుల్నీ నేర్చుకుంటున్నారు. సాంకేతిక రంగంలో వారికి ఉన్న స్థానం గురించి ప్రత్యేకంగా ఏమీ చెప్పనవసరం లేదు కదా?! తేనెకన్నా తీయనైన భాష – **మన భాష**, తెలుగు! దాన్ని మరచిపోకూడదు. మాతృభాష తల్లిపాల వంటిది. పరభాష దాది పాల వంటిది" అని చెప్పాడు కృష్ణ.

అటు తర్వాత కృష్ణ అయ్యవారు పిల్లలను ప్రతిరోజూ 2 గంటలసేపు తెలుగులో మాట్లాడించారు. తెలుగు కథలు చదివించారు. సొంతగా కథలు రాయండని ప్రోత్సహించారు. క్రమంగా పిల్లలందరికీ అర్థమయ్యింది- మాతృభాష విలువేంటో. మాతృభాషని క్షుణ్ణంగా నేర్చుకుంటే ఇతర భాషలూ సులభంగా నేర్చుకోవచ్చు! ఎంత జటిలమైన భావననైనా మనం అర్థం చేసుకునేది సొంత భాషలోనే కదా, ఆ భాష బాగా వస్తే అన్ని భావనలూ సులభంగా అర్థం అవుతాయి. అందుకని తెలుగు బాగా వచ్చిందంటే మిగతా అంశాలన్నీ చక్కగా వంట పడతాయి!

లోకంలో మంచిపని దీపంలా ప్రకాశిస్తుంది అంటారు. పిల్లల్లో వచ్చిన ఈ మార్పు క్రమంగా అందరికంటా పడింది. పాఠశాల యాజమాన్యంతోపాటు మిగతా ఉపాధ్యాయులు అందరూ కూడా తమ తప్పును తెలుసుకున్నారు. కృష్ణ అయ్యవారిని ప్రశంసించారు.

ఈ రోజున మేము మా భావాలను చక్కగా వ్యక్తం చేయ గలుగు తున్నాము. దేన్నైనా సులభంగా నేర్చుకోగలుతున్నాము. మేము ఈ దేశంలో పుట్టడం మాకు ఎంతో గర్వకారణం- ఎందుకంటే ఈ దేశంలో తెలుగుభాష ఉంది! నిజంగానే తెలుగులో అన్నీ నేర్చుకోవచ్చు- ఇంగ్లీషు కూడా! మనం అందరం తెలుగుభాషను గౌరవిద్దాం. మన భాషను మనం మరచిపోవద్దు. కృష్ణగారి లాంటి ఉపాధ్యాయులు ఇంకా చాలా మంది ఉన్నారు- వాళ్ళందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు!

Edited, typeset and Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in and printed at Mudrica Offcet printers, Vijayawada, Phone:08662579129.